TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

మేడ్చల్ | శుక్రవారం | 07.08.2026 | సంపుటి : 2 | సంచిక : 36 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు


ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

# డిజిటల్ చెల్లింపులపై బాదుడు

## యూపీఐ ద్వారా చేసే పేమెంట్లపై బాదుడుకు కేంద్రం రెడీ

ఇప్పటిదాకా యూపీఐతో పాటు రూపే చెల్లింపులపై జీరో చార్జీలు

ఇకపై ఎప్పటికప్పుడు చార్జీలు విధించే అధికారం ప్రభుత్వానికి..

చట్టం సవరణ.. లోక్‌సభ ఆమోదం

ఎవరిపై చార్జీ విధించినా ప్రజల జేబుకే చిల్లు

డిజిటల్ నుంచి మళ్లీ క్యాష్ వైపు మళ్లించే చర్యలంటూ విమర్శలు

పల్లె నుంచి పట్నం వరకు దాదాపు అన్ని నగదు లావాదేవీలు ఇప్పుడు డిజిటల్ పద్ధతిలోనే జరుగుతున్నాయి. అది రూపాయి అయినా వేల రూపాయలైనా సరే..స్మార్ట్ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే చాలు.. చిటికెలో చెల్లింపు జరిగిపోతోంది. అదీ ఎలాంటి చార్జీ లేకుండా..పూర్తి ఉచితంగా. కానీ ఇప్పుడా పరిస్థితి మారనుంది. డిజిటల్ పద్ధతిలో సులువుగా చెల్లింపులు జరిపేందుకు వీలు కల్పిస్తున్న యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) విధానం ఇకపై ఆర్థికంగా భారం కానుంది.




న్యూఢిల్లీ,ఆగస్ట్ 6 : ఇప్పటివరకు ఉచితంగా కొనసాగుతున్న యూపీఐ సర్వీసు మీద భవిష్యత్తులో చార్జీలు విధించబోయే పరిస్థితి రానుంది. యూపీఐ చెల్లింపులపై ఫీజులు విధించడానికి బ్యాంకులు, పేమెంట్ సిస్టం ప్రొవైడర్స్‌ని అనుమతించేలా ప్రభుత్వానికి అధికారమిచ్చే చట్ట సవరణను లోక్‌సభ ఆమోదించింది. రూపే డెబిట్ కార్డు ద్వారా చెల్లింపులపైనా చార్జీలు విధించడానికి ఇది మార్గం సుగమం చేయనుంది. యూపీఐ వ్యవస్థ నిర్వహణ భారం తడిసి మోపెడవుతోందని, చార్జీలు వసూలు చేసుకునేందుకు వీలు కల్పించాలంటూ బ్యాంకులు, పేమెంట్

-మిగతా 2 లో..



# ఔటర్ రింగ్ రోడ్డు నిర్వహణలో గుత్తేదారు నిర్లక్ష్యం

ఎక్కడికక్కడ వాహనాలు నిలపడంతో ప్రమాదాలు

అన్ని రకాల రహదారులను ఒకే వ్యవస్థలోకి తీసుకురావాలి

హెచ్ఆర్‌డీసీఎల్ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఔటర్ రింగ్ రోడ్డు నిర్వహణ సరిగా లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓఆర్ఆర్ నిర్వహణలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డుపై ఎక్కడికక్కడ వాహనాలను నిలపడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. హెచ్‌ఎండీఏ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు.

హైదరాబాద్, ఆగస్ట్6 : హైదరాబాద్ మహానగర భవిష్యత్తు రోడ్ల విస్తరణ, అభివృద్ధి పైనే ఆధారపడి ఉందని సీఎం అన్నారు. అవసరమైన భూ సేకరణ పనులను వేగవంతం చేయాలని, ఇందులో అలసత్వం చూపరాదని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. "నగరంలోని అన్ని రోడ్ నెట్‌వర్క్‌లను ఒకే వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలి. భూసేకరణ, రుణాలు, రోడ్ల నిర్వహణ.. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లకు ఒకటే

-మిగతా 2 లో..



ప్రధాని విదేశీ టూర్ల వ్యయం

# ₹ 550 కోట్లు..

వచ్చిన ఎఫ్‌డీఐలు 30 లక్షల కోట్లపైనే..

పలు దేశాల పర్యటనలపై వివరాలు వెల్లడించిన విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ,ఆగస్ట్6 : ప్రధాని మోదీ విదేశీ ప్రయాణాల ఖర్చులకు సంబంధించి విదేశాంగ శాఖ వివరాలు వెల్లడించింది. 2025లో మొత్తం 23 దేశాల్లో పర్యటించగా, ఇందుకోసం రూ.187 కోట్లు ఖర్చు అయినట్లు తెలిపింది. 2021 నుంచి విదేశీ ప్రయాణాల కోసం మొత్తంగా సుమారు రూ.550 కోట్లకుపైగా ఖర్చయ్యిందని, ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.74 కోట్లు ఖర్చు అయినట్లు పేర్కొంది. ప్రధాని మోదీ 2021 నుంచి ఇప్పటివరకు ఏయే దేశాల్లో పర్యటించారు? ఒక్కో దేశ పర్యటనకు (ఖీశీతీవఅస్త్రఅ ఎఱంఙ) అయిన ఖర్చు ఎంత? తదితర వివరాలపై రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు విదేశాంగశాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గెరిటా లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు పీఎం చేపట్టిన విదేశీ పర్యటనల కోసం రూ.74.58 కోట్లు ఖర్చు అయ్యింది. జులై 6 నుంచి 11 వరకు ఇండోనేసియా,

-మిగతా 2 లో..

# సింగరేణి చరిత్రలో మరో మైలురాయి

నైనీ గనుల నుంచి థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గురాక

రజైపూర్ వద్ద రైలుకు స్వాగతం పలికిన అధికారులు

బొగ్గు రాకపై డిప్యూటీ సీఎం భట్టి ఆనందం

సింగరేణి చరిత్రలో మరో మైలురాయి చేరింది. ఒడిశాలోని సింగరేణి నైనీ గని నుంచి తొలి బొగ్గు రైల్వే వ్యాగన్ తెలంగాణకు చేరింది. మంచిర్యాల జిల్లా జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రానికి బొగ్గు రైలు చేరుకుంది. సింగరేణి అధికారులు రైలుకు ఘన స్వాగతం పలికారు. 59 వ్యాగన్ల ద్వారా 4 వేల టన్నుల జీ-10 గ్రేడ్ బొగ్గు వచ్చింది. ఈసందర్భంగా సింగరేణి యాజమాన్యం, కార్మికులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు.



మంచిర్యాల, ఆగస్ట్ 6 : సింగరేణి చరిత్రలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమైందన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కి ఒడిశాలోని నైనీ బ్లాక్ నుంచి బొగ్గు చేరుకుంది. ఈ పరిణామపం పట్ల తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. గురువారం ఈ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు నైనీ బ్లాక్ నుంచి బొగ్గు లోడ్‌తో రైల్వే వ్యాగన్ వచ్చింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. రాష్ట్రంలో విద్యుత్ లోటు లేకుండా

-మిగతా 2 లో..



1.05 కోట్ల కొత్త ల్యామినేటెడ్

# రేషన్ కార్డులు

అర్హులకు ఆహార భద్రతను విస్తరించడమే లక్ష్యం

పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, ఆగస్ట్ 6 : తెలంగాణలో నూతన పీడీఎస్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం తుది ముహూర్తం ఖరారు చేసింది. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. అర్హులకు ఆహార భద్రతను విస్తరించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.05 కోట్ల కొత్త, ల్యామినేటెడ్ రేషన్ కార్డులను అర్హులకు అందించనున్నారు. సంగారెడ్డి జిల్లాలో

-మిగతా 2 లో..

# జొన్న రైతులకు శుభవార్త

రూ. 994 కోట్ల బకాయిలు జమ

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్,ఆగస్ట్6 : తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర రైతాంగానికి తీపి కబురు అందించారు. జొన్న పంట కొనుగోళ్లకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన రూ. 994 కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ధాన్యం, పంటల కొనుగోలు విధానం వేగవంతంగా, పారదర్శకంగా సాగుతోందని, ఇది మొత్తం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే రాష్ట్రంలో

-మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74

తెలంగాణ కోసం కడవరకు తపించిన

# జయశంకర్ సార్

కేసీఆర్ పట్టుదలపై నమ్మకంతో వెన్నంటి వచ్చారు

జయంతి సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఆగస్ట్ 6 : తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్‌కు మించి దక్షత, కమిట్‌మెంట్, తెలంగాణ సాధించాలనే

-మిగతా 2 లో..





## నీట్‌లో పెన్, పేపర్ విధానానికి స్వస్తి

నందన్ నీలేకన్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు

సుప్రీంకోర్టుకు కేంద్రం అఫిడవిట్ దాఖలు

02

సైబర్ నేరాల నియంత్రణలో

# తెలంగాణ ప్రథమ స్థానం

కేంద్ర హోంశాఖ ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్ట్ 6 : సైబర్ నేరాల నియంత్రణలో దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్రాల సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరును పరిశీలించిన కేంద్ర హోంశాఖ ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. కేంద్ర హోంశాఖ నిర్దేశిరచిన 9 ప్రామాణికాల ఆధారంగా తెలంగాణ తొలి స్థానంలో నిలిచినట్లు పేర్కొంది. సైబర్ కమాండ్ ఏర్పాటు, ఈ-జీరో ఎఫ్ఐఆర్ అమలు, గ్రీవెన్స్ రీడ్రెసెల్ మాడ్యూల్, రిఫండ్ కోసం మనీ రీస్టోరేషన్ మాడ్యూల్, సహయోగ్ పోర్టల్, సమన్వయ పోర్టల్ వినియోగ గణాంకాలు, సైబర్ క్రైమ్ హాట్ స్పాట్‌లపై నిఘా వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంది.



జనం వార్త



# ప్రధాని విదేశీ టూర్ల వ్యయం 550 కోట్లు..

(మొదటిపేజీ తరువాయి)

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ప్రధాని మోదీ పర్యటించారు. విదేశీ పర్యటనల కోసం గతేడాది (2025లో) రూ.187 కోట్లు, 2024లో రూ.109 కోట్లు, 2023లో రూ.93 కోట్లు, 2022లో రూ.55 కోట్లు, 2021లో రూ.36 కోట్లు ఖర్చయినట్లు కేంద్రం వెల్లడించింది. గతేడాది (2025) మొత్తంగా 23 దేశాల్లో పర్యటించారు. ఫ్రాన్స్ (రూ.25 కోట్లు), అమెరికా (రూ.16 కోట్లు), సౌదీ అరేబియా (రూ.15 కోట్లు), బ్రెజిల్ (రూ.17 కోట్లు), చైనా (రూ.10 కోట్లు), బ్రిటన్ (రూ.9 కోట్లు) తదితర దేశాల్లో ప్రధాని మోదీ అధికారిక పర్యటనలు చేశారు. మారిషస్, థాయ్‌లాండ్, శ్రీలంక, సైప్రస్, కెనడా, క్రొయేషియా, ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, నమీబియా, మాల్దీవులు, జపాన్, భూటాన్, దక్షిణాఫ్రికా, జోర్డాన్, ఒమన్, ఇథియోపియా దేశాల్లోనూ ప్రధాని మోదీ పర్యటించారు. వివిధ దేశాలతో సన్నిహిత సంబంధాలను పెంపొందించడానికి.. ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశ భాగస్వామ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు ప్రధానమంత్రి అత్యున్నత స్థాయి పర్యటనలు దోహదం చేస్తాయని విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ పర్యటనల (ఏప్రిల్ 2021– డిసెంబర్ 2025 మధ్య) సందర్భంగా చేసుకున్న అవగాహన ఒప్పందాల్లో భాగంగా సుమారు 381 బిలియన్ డాలర్ల (రూ.30 లక్షల కోట్ల కన్నా ఎక్కువ) విలువైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చినట్లు తెలిపింది.

# ఔటర్ రింగ్ రోడ్డు నిర్వహణలో గుత్తేదారు నిర్లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

వ్యవస్థ ఉండాలి. ఓఆర్‌ఆర్‌పై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు గుత్తేదారు నిర్లక్ష్యంగా ఉన్నాడు. ఓఆర్‌ఆర్ నిర్వహణను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షణ చేయాలి. ప్రభుత్వం సేకరించిన భూములకు మాత్రమే టీడీఆర్ అమలు చేయాలి. ఈ ప్రక్రియను మొత్తం ఆన్‌లైన్ చేయాలి. రేడియల్ రోడ్ల నిర్మాణం వేగవంతం చేయాలి. కొంగరకలాన్ – ఫ్యూచర్‌సిటీ రేడియల్ రోడ్డు డిసెంబర్ 9లోపు పూర్తి చేయాలి. ల్యాండ్ పూలింగ్‌లో మధ్యవర్తుల జోక్యాన్ని సహించవద్దు" అని అన్నారు. సమావేశంలో హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.



# 1.05 కోట్ల కొత్త ల్యామినేటెడ్ రేషన్ కార్డులు

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి స్వయంగా ఈ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని అన్ని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ పక్రియ మొదలవుతుంది. స్వాతంత్ర్య దినోత్సవం రోజున మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు ఈ పంపిణీ కార్యక్రమాలు సాగుతాయి. కార్యక్రమం సజావుగా సాగేందుకు ప్రతి నియోజకవర్గంలో పంపిణీ పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం ఆర్డీవోలకు అప్పగించింది. స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఈ వేడుకలు జరగనున్నాయి. కార్డుల సేకరణకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేదికల వద్ద మౌలిక వసతులు, తాగునీరు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పంపిణీ పూర్తయిన వెంటనే సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని స్పష్టమైన సూచనలు జారీ చేశారు.




# నీట్‌లో పెన్, పేపర్ విధానానికి స్వస్తి

- నందన్ నీలేకన్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు
- సుప్రీంకోర్టుకు కేంద్రం అఫిడవిట్ దాఖలు

**న్యూఢిల్లీ,ఆగస్ట్6 :** నీట్ యూజీ పరీక్షలో పెన్ అండ్ పేపర్ విధానానికి స్వస్తి చెబుతామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. జేఈఈ తరహాలో కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్ష (రాఅశ్రీఱఅవ జుఇఖుఎ) నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపింది. నందన్ నీలేకని నేతృత్వంలోని హైపవర్ టాస్క్‌ఫోర్స్ సిఫార్సుల మేరకు తుది నిర్ణయం తీసుకుంటామని పేర్కొంటూ సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్–యూజీ నిర్వహణపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. పేపర్ లీక్‌లు, వ్యవస్థాగత వైఫల్యాలను తొలగించేందుకు నీట్ (చీజుజు) నిర్వహణలో సమగ్ర మార్పులు చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇటీవల పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ కొనసాగుతుందని స్పష్టం చేసింది. మరోవైపు, ఒకవేళ పరీక్షను కంప్యూటర్ విధానంలోకి మారిస్తే.. ఆ విషయంపై ముందే స్పష్టత ఇవ్వాలని వైద్యుల సంఘం కోరింది. కేంద్రం దాఖలు చేసిన అఫిడవిట్‌పై స్పందనను తెలియజేయాలని వైద్యుల సంఘంతోపాటు సంబంధిత పిటిషనర్లకు సుప్రీం కోర్టు సూచించింది.

# డిజిటల్ చెల్లింపులపై బాదుడు

(మొదటిపేజీ తరువాయి)

ప్రాసెసర్లు చాన్నాళ్లుగా గగ్గోలు పెడుతున్న నేపథ్యంలో కేంద్రం ఆ మేరకు చర్యలు చేపట్టింది. అందరినీ డిజిటల్ చెల్లింపుల వైపు మళ్లించే లక్ష్యంతో ముందుగా యూపీఐ ఉచితమనే తాయిలం చూపించిన ప్రభుత్వం..దాదాపుగా దేశమంతా దానికి అలవాటు పడ్డాక ప్లేటు ఫిరాయించిందని, యూపీఐని కూడా ఆదాయ వనరుగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ చర్యల వల్ల మళ్లీ ప్రజలు నగదు లావాదేవీల వైపు మళ్లే పరిస్థితి తలెత్తుతుందని.. ఏటీఎంలు, బ్యాంకుల వద్ద గతంలోలా క్యూ లైన్లు కనిపించినా ఆశ్చర్యం లేదని విశ్లేషకులు అంటున్నారు. ప్రస్తుతం చెల్లింపుల సంబంధ ఆర్థిక లావాదేవీల కోసం ప్రాథమికంగా బ్యాంకులు, పేమెంట్ ప్రాసెసర్ల నెట్‌వర్క్‌లను ఉపయోగించుకున్నందుకు గాను వ్యాపార వర్గాలు ఆయా సంస్థలకు చెల్లించాల్సిన చార్జీలను మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్)గా వ్యవహరిస్తున్నారు. ఇందులో ఇంటర్‌చేంజ్ ఫీజు, ప్రాసెసింగ్ చార్జీలు, నెట్‌వర్క్ ఫీజులు, పన్నుల్లాంటివి ఉంటాయి. క్రెడిట్, డెబిట్ కార్డులను జారీ చేసే బ్యాంకులకు చెల్లించేది ఇంటర్‌చేంజ్ ఫీజు, రేజర్‌పే, పేయూలాంటి పేమెంట్ ప్రాసెసర్ లేదా గేట్‌వేలకు కట్టేవి ప్రాసెసింగ్ చార్జీలు. వీసా, మాస్టర్‌కార్డ్ ఎన్‌పీసీఐలాంటి పేమెంట్ నెట్‌వర్క్‌లకు వెళ్లేది నెట్‌వర్క్ ఫీజు. అంతిమంగా ఈ సర్వీసులపై జీఎస్‌టీ కింద ప్రభుత్వానికి ట్యాక్సులు వెళ్తాయి. అయితే దేశీయ పేమెంట్ గేట్‌వేని, డిజిటల్ చెల్లింపుల విధానాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో 2020 నుంచి యూపీఐ, రూపే డెబిట్ కార్డు లావాదేవీలపై ఎలాంటి ఎండీఆర్ అయినా జీరో చేస్తూ కేంద్రం చట్టం చేసింది. ఈ నేపథ్యంలో రూపే, యూపీఐ మినహా ఇతర వ్యవస్థల్లో యధావిధిగా 0.4 శాతం నుంచి 4.5 శాతం వరకు (కార్డును బట్టి) ఎండీఆర్ చార్జీలు కొనసాగుతున్నాయి. కాగా తాజా చట్ట సవరణలో యూపీఐ, రూపే




డెబిట్ కార్డు లావాదేవీలపై 'ఎండీఆర్ జీరో'ను తొలగించి దీనిపై నిర్ణయాధికారాన్ని ప్రభుత్వానికి కట్టబెట్టారు. ప్రభుత్వం ఇకపై ఎప్పటికప్పుడు విడుదల చేసే నోటిఫికేషన్ల ద్వారా యూపీఐ, రూపే లావాదేవీలకు సంబంధించిన చార్జీలను నిర్ణయించనుంది. యూపీఐ లావాదేవీల వ్యయాల భారంలో కొంత భాగాన్ని బ్యాంకులు, పేమెంట్ ప్రాసెసర్లు భరిస్తుండగా, మిగతాదంతా ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తోందని, ఇదంతా పన్ను చెల్లింపుదారుల సొమ్మేనని నిపుణులు చెబుతున్నారు. ఈ భారం ఏటా దాదాపు రూ. 20 వేల కోట్లు ఉంటుందని అంచనా. వాస్తవానికి తక్కువ విలువ చేసే లావాదేవీలను ప్రోత్సహించే ఉద్దేశంతో రూ.2 వేల లోపు విలువ ఉండే లావాదేవీలపై బ్యాంకులకు సబ్సిడీ ఇచ్చేలా 2021 డిసెంబర్‌లో ప్రభుత్వం స్కీమును ప్రవేశపెట్టింది. 2021--22లో ఇలా రూ.1,389 కోట్ల సబ్సిడీ ఇవ్వగా, 2023--24 నాటికి ఇది ఏకంగా రూ.3,631 కోట్లకు పెరిగింది. దీంతో క్రమంగా ఈ భారాన్ని తగ్గించుకోవడంపై ప్రభుత్వం దృష్టి పెడుతోంది. 2026--27 బడ్జెట్‌లో ఇందుకోసం రూ.2 వేల కోట్లు మాత్రమే కేటాయించడం ఇందుకు నిదర్శనమని విశ్లేషకులు చెబుతున్నారు. ఇక ఇతరత్రా ఎలక్ట్రానిక్ పేమెంట్స్ విధానాల్లో ఎండీఆర్ చార్జీలను పరిస్థితులను బట్టి కొందరు వ్యాపారులు తామే చెల్లిస్తుండగా మరికొందరు ఆ భారాన్ని కస్టమర్లకే బదలాయిస్తున్నారు. యూపీఐ పేమెంట్లపై చార్జీల వడ్డనకు రంగం సిద్ధమవుతున్నప్పటికీ, అన్ని చెల్లింపులపైనా చార్జీల భారం పడకపోవచ్చని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. రూ.2 వరకు చెల్లింపులపై మినహాయింపు ఉండొచ్చని చెబుతున్నాయి. రూ.50 కోట్ల పైబడి టర్నోవర్ ఉండే పెద్ద వ్యాపారులకు సంబంధించిన యూపీఐ లావాదేవీలపై 0.3--0.6 శాతం వరకు చార్జీలు విధించవచ్చని పేర్కొన్నాయి. ప్రస్తుతం చిన్న వ్యాపారులకు చేసే రూ.2 వేల వరకు మొత్తాలకు మాత్రమే ప్రభుత్వం ఇన్సెంటివ్ స్కీము కింద సబ్సిడీనిస్తోంది. ఆర్థిక శాఖ డేటా ప్రకారం 2026 ఆర్థిక సంవత్సరంలో వ్యాపారులకు కస్టమర్లు చెల్లించిన రూ.2 వేలకు పైబడిన లావాదేవీల పరిమాణం కేవలం 4 శాతంగానే ఉంది. లోకల్ సర్కిల్స్ అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ఇటీవల నిర్వహించిన సర్వే ప్రకారం రూ.3 వేలకు పైబడే యూపీఐ పేమెంట్ల మీద చార్జీలను కస్టమర్ల నుంచే వ్యాపారులు వసూలు చేస్తే తాము యూపీఐని వాడటం మానేస్తామంటూ దాదాపు 98 శాతం మంది చెప్పారట. అయితే ప్రస్తుతానికి ఇవన్నీ ఊహగానాలేనని, వాస్తవ చార్జీలు.. భవిష్యత్తులో చట్ట సవరణ పూర్తిస్థాయిలో ఆమోదం పొందిన తర్వాత ప్రభుత్వం విడుదల చేసే నోటిఫికేషన్ ద్వారా మాత్రమే వెల్లడవుతాయని బ్యాంకర్లు చెబుతున్నారు.

# సింగరేణి చరిత్రలో మరో మైలురాయి

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. దేశ అవసరాలకూ సింగరేణి బొగ్గు కీలకమని గుర్తు చేశారు. కొత్త కోల్ బ్లాకుల కోసం ప్రయత్నాలు కొనసాగుతాయని తెలిపారు. సింగరేణిని కాపాడుకుంటామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. నైనీ గనుల నుంచి బొగ్గు రాకతో సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు ఆ కొరత తీరిందని వివరించారు. సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ కి రైలు వ్యాగిన్ చేరుకోగానే.. ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. 9 బాక్స్ వ్యాగన్లలో మొత్తం 4,000 టన్నుల జీ–10 రకం బొగ్గు ఒడిశాలోని నైనీ గని నుంచి గురువారం ఉదయం జైపూర్‌కు చేరుకుంది. సింగరేణి కాలరీస్ నుంచి 136 ఏళ్ల చరిత్రలో తొలిసారిగా రాష్ట్రం వెలుపల ఉన్న గని నుంచి బొగ్గు ఉత్పత్తిని సాధించి సొంత థర్మల్ ప్లాంట్‌కు రవాణా చేయడం ఇదే తొలిసారి. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడం వెనుక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అలుపెరగని కృషి, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. అనుమతుల సాధనలో ఎదురైన ఎన్నో అడ్డంకులను పటాపంచలు చేస్తూ ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారని పేర్కొంది. అనుమతుల కోసం భట్టి విక్రమార్క స్వయంగా రెండుసార్లు ఒడిశా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. 2024 జులైలో ఒడిశా ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో సానుకూల వాతావరణంలో చర్చలు జరిపి, ఆటంకాలన్నీ తొలగించారని సర్కార్ స్పష్టం చేసింది. అనంతరం 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు



ఉత్పత్తిని వర్చువల్ విధానంలో డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఆ శ్రమ ఫలితంగా నైనీ గని నుంచి బయలుదేరిన తొలి రైలు 1,131 కిలోమీటర్లు ప్రయాణించి తెలంగాణ గడ్డపైకి చేరుకుంది. 59 బాక్స్ వ్యాగన్ల ద్వారా ఏకంగా 4 వేల టన్నుల అత్యుత్తమ జీ–10 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు సింగరేణి థర్మల్ కేంద్రానికి చేరింది. కేంద్ర బొగ్గు శాఖ 2015 ఆగస్టు 13న సింగరేణికి కేటాయించిన ఈ నైనీ గని, మొత్తం 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ గని జీవితకాలం 36 సంవత్సరాలు కాగా, ఏడాదికి కోటి టన్నుల (10 మిలియన్ టన్నులు) ఉత్పత్తి సామర్థ్యంతో నడవనుంది. నైనీ నుంచి నాణ్యమైన బొగ్గు రాకతో తెలంగాణ విద్యుత్ ఉత్పత్తిలో ఇకపై ఎలాంటి ఆటంకాలు ఉండవని, భవిష్యత్తు తరాలకు నిరంతర ఉచిత, నాణ్యమైన విద్యుత్ అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని స్పష్టమవుతోంది. సింగరేణి కీర్తి కిరీటంలో ఈ నైనీ బొగ్గు గని మరో వజ్రంగా నిలిచిపోనుంది.

# తెలంగాణ కోసం కడవరకు తపించిన జయశంకర్ సార్

(మొదటిపేజీ తరువాయి)

మొండితనం ఉన్న నాయకుడిని ఒక్కరిని చూపించండి.. నేను మీ వెంబడి నడుస్తా అని అనేవారని, ఆయన మొహమాటం కూడా పడేది కాదని గుర్తు చేసుకున్నారు. దేవేందర్ గౌడ్ పార్టీ పెడితే వెళ్లి మీరు పోవొద్దు సార్ కేసీఆర్‌తో అసోసియేట్ అయి ఉన్నరని అంటే జయశంకర్ సార్ ఒక మాట చెప్పిండు.. ఎన్ని పార్టీలు వస్తే అంత మంచిది ఏం కాదు.. తెలంగాణ రాష్ట్రం రావాలే.. ఆ రాష్ట్రం వచ్చే క్రమంలో నేను వాళ్లకు తెలంగాణ కోసం స్పర్ధ లేకుండా, సమాంతరంగా పనిచేయండి.. ఒకరికి ఒకరు కలహించుకోకండి.. ఎవరు చేసిన అల్టిమేట్‌గా మీరందరూ కోరుతున్నది తెలంగాణెళి కదా..చెప్పి వస్తనన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఎన్ని కొత్త పార్టీలు పుట్టినా, వారికి తాత్కాలిక భావసారూప్యత లేకపోయినా, లక్ష్యసారూప్యత ఉండాలని బలంగా వాదించిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో మళ్లీ నీళ్లకు అన్యాయం చేసే ప్రయత్నం జరుగుతుందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణకు సంబంధించిన 7 ప్రాజెక్టులను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఏపీ ప్రభుత్వం అడుగుతుంది. ఢిల్లీ పార్టీ చేతుల్లో జుట్టు ఉంటే వాళ్లు ఆడించినట్లే ఆడాలి. అదే తెలంగాణ కోసం పుట్టిన పార్టీ అధికారంలో ఉంటే ఆ పరిస్థితి ఉంటుందా..? అని కేటీఆర్ అడిగారు. లోక్‌సభలో తెలంగాణ విభజనను పాకిస్తాన్‌తో పోలిస్తే ఒక్క బీజేపీ, కాంగ్రెస్ ఎంపీ అయినా మాట్లాడిండా..? అదే మనవాడు ఉంటే గల్లా పట్టి అడిగేవాడని అన్నారు.



రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 75వ సారి ఇవాళ ఆయన ఢిల్లీలో ఉన్నడు. ముఖ్యమంత్రి అయి 32 నెలలు కూడా కాలేదు.. రేపటితోనో, ఎల్లుండితోనో అవుతయి. కానీ 13 రోజులకోసారి ఢిల్లీ పోతడు.. 2,3 రోజులు అక్కడుంటడు. దేహి దేహీ అని ఈ రోజు అక్కడ యాచిస్తున్న డు. అందుకే జయశంకర్ సార్ ఢిల్లీకి సామంతులుగా ఉండొద్దు.. స్వతంత్రులుగా ఉండాలే అని కోరుకున్నరని అన్నారు. ఎన్నటికైనా స్వీయ రాజకీయ అస్థిత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష. తెలంగాణ కోసం ఒక స్వీయ రాజకీయ అస్థిత్వ పతాక ఉండాలే. ఎన్నటికైనా తెలంగాణ కోసం ఎలాంటి రాజీ లేకుండా ఎవరితో కాంప్రమైజ్ కాకుండా గొంతు విప్పితే ఒక సింహం లాగా గర్జించే విధంగా కేసీఆర్ తీరుగా గొంతు ఉండాలే.. అందుకే కాంగ్రెస్‌లో కలవొద్దు అని గట్టిగా వాదించిన నాయకుడు, మహానుభావుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కేటీఆర్ అన్నారు.

# నల్లమలలో రెండు పులుల మృతి

## ఒకటి వేటగాళ్ల తూటాలకు బలి
## ఏడుగురు నిందితుల అరెస్ట్

**అమరావతి,ఆగస్ట్6 :** నల్లమల అటవీ ప్రాంతంలో ఇటీవల మృతిచెందిన రెండు పులులలో ఒకదాన్ని వేటగాళ్లు చంపినట్లు అటవీశాఖ సలహాదారు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ఛైర్మన్ మల్లికార్జునరావు తెలిపారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో పులుల మృతిపై ఆయన వివరణ ఇచ్చారు. నల్లమల అడవుల్లో రెండు పులులు మరణించాయి. ఆత్మకూరు రీజియన్‌లో ఒకటి, గిద్దలూరు అటవీ ప్రాంతంలో మరొకటి మృతిచెందాయి. గిద్దలూరులో పులిని వేటగాళ్లు చంపారు. తుపాకీతో కాల్చడంతో బుల్లెట్ తగిలి మరణించింది. పులి మృతిచెందిన తర్వాత దాని గోళ్లు తీసుకెళ్లారు. ఈ ఘటనలో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశాం. వారి నుంచి పులిగోళ్లు స్వాధీనం చేసుకున్నాం. ఆత్మకూరు రీజియన్‌లో చనిపోయిన పులిది సహజ మరణమే. ముళ్లపందిని తినబోయి.. దాని ముల్లు గుచ్చుకోవడంతో చనిపోయిందని మల్లికార్జునరావు వివరించారు.



# జొన్న రైతులకు శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

ఎరువుల పంపిణీని మరింత పారదర్శకం చేసేందుకు రూపొందించిన 'తెలంగాణ ఎరువుల యాప్' విజయవంతం కావడంతో, దాని ప్రమాణాల ఆధారంగానే కేంద్ర ప్రభుత్వం 'ఫెర్టిలైజర్ ఫీల్డ్ స్టాఫ్' (ఈఈ÷ూ) వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిందని మంత్రి స్పష్టం చేశారు. ఈ నూతన ఎరువుల పంపిణీ విధానాన్ని నేటి నుంచి మరో 10 జిల్లాలకు విస్తరిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు విస్తరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, రైతులకు అవసరమైన ప్రోత్సాహకాలు, అవగాహన అందించాలని ఆదేశించారు. తెలంగాణను ఆయిల్ పామ్ ఉత్పత్తిలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. ఇదే సమావేశంలో చేనేత రంగానికి సరికొత్త సాంకేతికతను జోడించేలా నిర్వహించిన హ్యాండ్లూమ్ హ్యాకథాన్ లో విజేతగా నిలిచిన ప్రతిభావంతులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించి, ఘనంగా సన్మానించారు. చేనేత కార్మికుల నైపుణ్యానికి సాంకేతికత తోడైతే మార్కెటింగ్ రంగంలో అద్భుతాలు సృష్టించవచ్చని పేర్కొన్నారు. అన్నదాతల సంక్షేమం, వ్యవసాయ రంగం బలోపేతమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్

## అవయవాలను దానం చేసిన కుటుంబ సభ్యులు

**మెదక్,ఆగస్ట్6 :** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ కావడంతో అతని అవయవాలు మరో నలుగురికి ప్రాణాధారంగా మారాయి. పెద్ద శంకరంపేటకు చెందిన తోట రవీందర్ మండల పరిధిలోని మల్కాపూర్‌లో ఆర్‌ఎంపీగా విధులు నిర్వహిస్తూ అందరి మన్నలను పొందాడు. ఈ నెల రెండవ తేదీన ఆదివారం పెద్ద శంకరంపేట పట్టణ శివారులో తోట రవీందర్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. గురుపాదుగుట్ట వద్ద అతడు నడుపుతున్న బైకును ఎదురుగా వస్తున్న బైకు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. అయితే, అతనికి బ్రెయిన్ డెడ్ కావడంతో బతికే అవకాశం లేదని, అతని అవయవాలు దానం చేస్తే మరికొందరికి నూతన జీవితం లభిస్తుందని జీవన్‌దాన్ ఆర్గాన్ డొనేషన్ నిపుణులు, వైద్యులు అతడి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు వివరించారు. వైద్యుల సూచన మేరకు.. తన కుమారుడు భౌతిక రూపంలో లేకపోయినా మరో రూపంలో జీవించి ఉంటాడని ఆశతో అతడి కుటుంబ సభ్యులు అవయవ దానానికి అంగీకరించారు. వైద్య నిపుణులైన బృందం అతని గుండె, కాలేయం, కిడ్నీలు, నేత్రాలను సేకరించారు. అనంతరం రవీందర్ భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పెద్ద శంకరంపేటలో గురువారం అతడి అంత్యక్రియలు నిర్వహించారు. రవీందర్ భౌతిక కాయానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. రవీందర్ భౌతికకాయాన్ని చూడడానికి పెద్ద శంకరంపేట పట్టణంతోపాటు మల్కాపూర్‌తోపాటు ఇతర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో యువకులు, మహిళలు, బంధువులు తరలివచ్చారు.

# జయశంకర్ సార్‌కు ఎంపిల నివాళి

**హైదరాబాద్,ఆగస్ట్6 :** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 93వ జయంతి సందర్భంగా రాజ్యసభ బీఆర్‌ఎస్ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, దామోదర్ రావు, అమర్ రావు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌కు తోడుగా నిలిచి తెలంగాణ కోసం పోరాడారు జయశంకర్ సార్ అని అన్నారు. ?ప్రజల స్వాభిమానం, సమాన హక్కులు, సామాజిక న్యాయం కోసం జయశంకర్ సార్ నిరంతరం శ్రమించారని పేర్కొన్నారు.? సార్ ?తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం చేసిన సేవలు అమూల్యం అని వెల్లడించారు. మలిదశ ఉద్యమ సమయంలో తెలంగాణ కోసం పోరాడిన సార్ 2011లో ప్రత్యేక రాష్ట్రం రాకముందే కన్నుమూయడం బాధాకరమని పేర్కొన్నారు.

# గోదావరి ప్రాజెక్టులకు సమాధి

- ఏపీ డైరెక్షన్‌లో నడుస్తున్న జీఆర్‌ఎంబీ
- తెలంగాణకు జై అనని రేవంత్ సీఎంగా ఉన్నారు
- జయశంకర్ ఆరాటం..కెసిఆర్ పోరటంతోనే తెలంగాణ సాకారం
- జయశంకర్ జయంతి సందర్భంగా నివాళి అర్పించిన హరీష్ రావు



**సిద్దిపేట,ఆగస్ట్6 :** కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఏ రోజూ కూడా జై తెలంగాణ అనలేదని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వ్యక్తి ఈరోజు తెలంగాణ సీఎంగా ఉన్నారని విమర్శించారు. సిద్దిపేట ప్రాంతంతో ప్రొఫెసర్ జయశంకర్‌కు ఎంతో అనుబంధం ఉండేదని హరీశ్ రావు అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించిన అనంతరం హరీశ్ మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ వచ్చిందంటే కేసీఆర్ పోరాటం, జయశంకర్ సారు ఆరాటం వల్లే అని చెప్పుకొచ్చారు.గోదావరిలో 380 టిఎంసిల నీళ్లు కేసీఆర్ నాయకత్వంలో హక్కుగా సాధించామని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమం ముఖ్యంగా నీళ్ల కోసమే వచ్చిందని గుర్తుచేసిన హరీశ్ రావు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా ప్రాజెక్టులకు సంబంధించి ఒక్క అనుమతి కూడా తీసుకురాలేకపోయిందని దుయ్యబట్టారు. గతంలో 18 సార్లు జీఆర్‌ఎంబీ సమావేశాలు జరిగినప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకించినా,ఆనాడు తెలంగాణ ప్రభుత్వం వాటిని తిప్పికొట్టి అన్ని అనుమతులు సాధించిందన్నారు. కానీ నేడు చరిత్రలో తొలిసారిగా గతంలో అనుమతులు వచ్చిన ప్రాజెక్టులను కూడా రద్దు చేసి, రివ్యూ చేయాలనే అంశాన్ని జీఆర్‌ఎంబీ అజెండాలో చేర్చడం శోచనీయమన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రాజెక్టులు, నీళ్లపై కనీస సోయి లేదని, ఇప్పటికైనా కళ్లు తెరిచి జీఆర్‌ఎంబీ అజెండాను మార్పించాలని, ప్రభుత్వం వద్ద చిత్తశుద్ధి ఉంటే ఆ సమావేశాన్ని తక్షణమే బహిష్కరిం చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 3 సంవత్సరాల్లో ఒక్క ప్రాజెక్ట్‌కు కూడా అనుమతి తీసుకోలేదని మాజీ మంత్రి విమర్శించారు. ఆంధప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్ట్‌ను తెలంగాణ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోలేకపోతోందని ప్రశ్నించారు. సమ్మక్క- సారక్క ప్రాజెక్ట్‌కు హైడ్రాలజీ క్లియరెన్స్ వచ్చాక ప్రభుత్వం ఎందుకు వదులు కుంటుందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. స్టేజ్ 2కు సమ్మక్క సారక్క నీళ్లు అవసరమన్నారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టును నిర్మించే విషయంలో ఏపీ సర్కార్‌తో తెలంగాణ సర్కార్ లోపాయికారి ఒప్పందం చేసుకుందని హరీశ్ రావు ఆరోపించారు.జయశంకర్ సార్ తన జీవితాన్ని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పూర్తిగా త్యాగం చేశారని, కేసీఆర్ పోరాటం, జయశంకర్ సార్ ఆరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఎప్పుడూ పాల్గొనని, కనీసం 'జై తెలంగాణ' అని అనని వ్యక్తి ఈరోజు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు. గోదావరి, బనకచర్ల ప్రాజెక్టుల నిర్మాణంలో తెలంగాణ ప్రభుత్వం ఆంధప్రదేశ్ ప్రభుత్వంతో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. మొదట అజెండాలో లేదన్నారని, ఆ తర్వాత ఢిల్లీ మీటింగ్‌లో చేర్చారని, సమావేశానికి హాజరుకామని చెప్పి వెళ్లి సంతకాలు పెట్టారని విమర్శించారు. కనీసం రిట్ పిటిషన్ వేయడం కూడా ఈ ప్రభుత్వానికి రావడం లేదని ఎద్దేవా చేశారు.



## జయశంకర్ సార్‌కు సీఎం రేవంత్ నివాళి

**హైదరాబాద్, ఆగస్ట్ 6 :** ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా జూబ్లీ హిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. సిద్దాంతకర్తగా తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయ శంకర్ పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడని ఆయన కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## కొత్త తెల్ల రేషన్ కార్డులకు ముహూర్తం ఖరారు

**హైదరాబాద్,ఆగస్ట్6 :** తెలంగాణలో తెల్లరేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 15 నుంచి కొత్త తెల్ల రేషన్ కార్డుల పంపిణీ చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.అర్హులైన 1.05 కోట్ల మంది పేదలకు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వనున్నట్లు వివరించారు. ఆగస్టు 15న సంగారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రేషన్‌కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. అదే రోజున మొత్తం 119 నియోజకవర్గాల్లో ఒకేసారి రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామని వెల్లడించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందిస్తామని చెప్పారు.



## ఉమెన్ సేఫ్టీ వింగ్ కస్టడీలో ఉదయ్ కృష్ణారెడ్డి

- ట్రైనీ ఐపిఎస్‌ను ప్రశ్నిస్తున్న పోలీసులు
- నేటితో ముగియనున్న పోలీస్ కస్టడీ

**హైదరాబాద్,ఆగస్ట్6 :** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిని ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఐదున్నర గంటల వరకు కస్టడీ కొనసాగనుంది. అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఉమెన్ సేఫ్టీ డీసీపీ లావణ్య నాయక్ ఆధ్వర్యంలో విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో డీసీపీ .. అత్తాపూర్ పీఎస్‌కు చేరుకున్నారు. కృష్ణారెడ్డిని డీసీపీ పర్యవేక్షణలో సీఐ జ్యోత్స్న విచారిస్తున్నారు. కస్టడీలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. విచారణలో కీలక ఆధారాలు సేకరించే దిశగా పోలీసులు దృష్టి సారించారు. ప్రధానంగా మిస్సైన మొబైల్ ఫోన్‌పై పోలీసులు ఫోకస్ పెట్టారు. ఉదయ్ కృష్ణారెడ్డి రెండో మొబైల్ పైన ఆరా తీస్తున్నారు. మిస్సైన రెండో మొబైల్ దొరికినట్లయితే మరికొన్ని కీలక అంశాలు బయటపడే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ఉదయ్‌కు సంబంధించిన ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్‌ను పోలీసులు సీజ్ చేసి ఎఫ్‌ఎస్‌ఎల్‌కు పంపించారు. హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిని గత నెల 28న పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలంటూ ఉమెన్స్ సేఫ్టీ వింగ్ అధికారులు ఉప్పరపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. రెండు రోజుల పాటు కస్టడీకి న్యాయస్థానం అనుమతిచ్చింది. ఈ నేపథ్యంలోనే ఉదయ్ కృష్ణారెడ్డిని కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. మహిళా ట్రైనీ ఐపీఎస్‌తో పరిచయం, లైంగిక వేధింపులు, తదితర అంశాలపై పోలీసుల విచారణ కొనసాగనుంది.

## రాయదుర్గం భూముల కేసులో సుప్రీం కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ,ఆగస్ట్6 :** హైదరాబాద్ రాయదుర్గం భూముల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. టీజీఐఐసీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ముగిసిందని తెలిపింది. ఈ క్రమంలోనే తెలంగాణ హైకోర్టు ఆదేశించిన డ్రోన్ సర్వేపై సుప్రీంకోర్టు స్టే విధించింది. యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసింది. తమ వాదనలు వినకుండానే సర్వే ఆదేశాలు ఇచ్చారని టీజీఐఐసీ వాదనలు వినిపించింది. అయితే, హైకోర్టులో ఇంప్లీడ్ అయ్యేందుకు సుప్రీం కోర్టు అనుమతిచ్చింది. ఆగస్టు 14వ తేదీ వరకు టీజీఐఐసీకి గడువు విధించింది. ఆ లోగా హైకోర్టులో సవరణ దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది. రాయదుర్గం సర్వే నంబర్ -83/2లోని 46 ఎకరాల భూమిని వేలం వేసే ప్రతిపాదన లేదని సుప్రీంకోర్టుకు టీజీఐఐసీ సీనియర్ న్యాయవాది తెలిపారు.

# విద్య వ్యాపార వస్తువుగా మారింది

- ఎల్‌కెజికే లక్షల్లో ఫీజులు దండుకుంటున్నారు
- నిరుద్యోగం, ఫీజుల దోపిడీ,ప్రభుత్వ వ్యవస్థల నిర్వీర్యంపై పోరు
- క్యా బోల్తీ పబ్లిక్ పేరిట...దేశ వ్యాప్త పర్యటనలు
- ప్రెజర్ గ్రూపుగా పనిచేసేందుకే నిర్ణయం
- కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే



**ముంబై, ఆగస్ట్ 6 :** కాక్రోచ్ జనతా పార్టీవ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్' అంటే ప్రజలు ఏమంటున్నారు... పేరుతో కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగం, విద్యా సంస్కరణలు, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రజల వద్దకు తీసుకెళ్తామని ఆయన తెలిపారు. విద్యార్థి నిరసనలతో దేశం దృష్టి ఆకర్షించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కీలక ప్రకటన చేసింది. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు 'క్యా బోల్తీ పబ్లిక్' పేరిట జాతీయస్థాయి ప్రచారం నిర్వహిస్తామని వెల్లడించింది. ప్రజల ఆందోళనలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవడం, అభిప్రాయాలను తీసుకోవడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని స్పష్టం చేసింది. సెప్టెంబర్ నుంచి దేశవ్యాప్తంగా పర్యటించి ప్రతి ఒక్కరితోనూ మమేకమవుతామని తెలిపారు. సీజేపీ ఒక రాజకీయ పార్టీగా మారకుండా ఒక ఒత్తిడి బృందంగానే కొనసాగుతుందని దీప్కే ప్రకటించారు. మహారాష్ట్రలో నిర్వహించిన పార్టీ ప్రధాన బృంద సమావేశం అనంతరం దీప్కే ఈ ప్రకటన చేశారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేయాలనే ఉద్దేశం లేదని, ప్రజల తరఫున ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చే ప్రెషర్ గ్రూప్‌గా పనిచేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. దేశ యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజులు, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత, ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల్లో తగ్గుతున్న విశ్వాసం వంటి అంశాలపై ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ ప్రచారంలో విద్యార్థులు, యువత, సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ రోజు మన దేశంలో సంస్థాగత జవాబుదారీతనం ప్రమాదకర స్థితిలో ఉంది. ఇది మన ప్రజాస్వామ్యానికి ఒక ప్రమాదకర సంకేతం. గతంలో ఓటర్లు ప్రభుత్వాన్ని ఎన్నుకునేవారు. ఈ రోజు ఎవరు ఓటు వేయాలో ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. ప్రజాస్వామ్యం ఇలా పనిచేయదు. మనం ఎన్నికల సంఘం జవాబుదారీతనాన్ని సరిదిద్దాలి. మనం ఇది చేసేంత వరకు దేశంలో ఎన్నికల అవకతవకలు కొనసాగుతాయి' అని దీప్కే పేర్కొన్నారు. నిరుద్యోగం దేశంలో ఒక ప్రధాన సమస్య అని, దీనిని దేశవ్యాప్త సమస్యగా పరిగణిస్తామని దీప్కే తెలిపారు. భారతీయ కుటుంబాలకు నాణ్యమైన విద్య రోజురోజుకూ భారంగా మారుతోందని, అందుకే ఆ అంశంపైనే తొలుత తాము దృష్టిసారిస్తామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. సెప్టెంబర్ నుంచి ప్రజల్లోకి వెళ్తామని మీడియా వేదికగా తెలియజేశారు. ఒకటో తరగతికే ఫీజులు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలల్లో ఇంకా ఎక్కువే ఫీజులు ఉంటున్నాయి. మధ్యతరగతి కుటుంబాలు ఆ మొత్తాన్ని ఎలా భరిస్తాయి. ఈ ఖర్చుల వల్ల ప్రజలు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఆ భారం తగ్గాలని మా పార్టీ కోరుకుంటోంది. తల్లిదండ్రులు పిల్లలకు ఉన్నత విద్య అందించాలనుకున్నప్పుడు దానిని వారు భారంగా భావించకూడదు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చెప్పిన ప్రకారం.. విద్య ప్రాథమిక హక్కు. గత కొన్నేళ్లుగా అది ఒక వ్యాపారంగా మారిపోయిందని దీప్కే ఆందోళన వ్యక్తంచేశారు. తమ ప్రచారంలో పాల్గొనాలనుకునేవారు అధికారిక క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయాలని సూచించారు. ఆ క్యూఆర్ కోడ్‌లను మీడియా సమావేశంలో ప్రదర్శించారు. సభ్యత్వం పూర్తిగా ఉచితమని చెప్పారు. మోసపూరిత చెల్లింపు అభ్యర్థనల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవస్థలు ప్రజలకు జవాబుదారీగా ఉండేలా... ఒత్తిడి తెచ్చే సంస్థగా సీజేపీ పనిచేస్తుందని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. రాజకీయ పార్టీల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రజలు ఉదయం ఒక పార్టీకి ఓటేస్తే సాయంత్రంకల్లా మరో పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఆయన అన్నారు.

## యువత ఆందోళనలను అర్థం చేసుకోవాలి

**వారి నిరసనలో న్యాయం ఉందన్న మోహన్ భగవత్**

**ముంబై,ఆగస్ట్6 :** జెన్-జీ యువత దేశ వ్యతిరేకులు కాదని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలు, వారు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు సమర్థనీయమైనవేనని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు అనేవి సంభాషణకు, సమస్యల పరిష్కారానికి దోహదపడే మార్గాలని ఆయన స్పష్టం చేశారు. ముంబైలో నిర్వహించిన ఐఐఎమ్‌యూఎన్ సమావేశంలో మోహన్ భాగవత్ పాల్గొన్నారు. అనంతరం జెన్-జీ, జెన్-ఆల్ఫా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ చీఫ్ మాట్లాడుతూ.. తమ కాలంలో పెద్దల మాటకు ప్రాధాన్యం ఇచ్చేవారమని, అయితే నేటి జెన్-జీ ప్రతి అంశానికి తార్కిక వివరణలు కోరుకుంటోందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశ్నించడం, తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం, నిరసనలు తెలియజేయడం ప్రజాస్వామ్య హక్కులేనని మోహన్ భాగవత్ చెప్పుకొచ్చారు. అయితే నిరసనలు చేపట్టేందుకు ప్రజాస్వామ్యంలో కొన్ని పద్ధతులు, నియమాలు ఉంటాయని యువత గుర్తించాలని సూచించారు. యువత ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకుంటూ వారితో నిరంతర సంభాషణ కొనసాగించడం అవసరమని మోహన్ భాగవత్ చెప్పారు. ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా వందకు పైగా నగరాల నుంచి దాదాపు 2 వేల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఇకపోతే స్వలింగ వివాహాలపై ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. స్వలింగ సంపర్కులు కూడా సమాజంలో భాగమేనని.. వారికి గౌరవప్రదంగా కలిసి జీవించే హక్కు ఉండాలని వ్యాఖ్యానించారు. అయితే అలాంటి బంధాన్ని 'వివాహం'గా పిలవకుండా.. కలిసి జీవించేందుకు ప్రత్యేక చట్టపరమైన వ్యవస్థను రూపొందించవచ్చని సూచిం చారు. భారతీయ సంప్రదాయంలో వివాహ వ్యవస్థకు ప్రత్యేకమై న స్థానం ఉందని పేర్కొన్నారు. మన సంప్రదాయంలో వివా హం అనేది ఇద్దరు వ్యక్తులు కలిసి జీవించేందుకు ఏర్పడిన సౌకర్యం మాత్రమే కాదని.. అది కుటుంబ వ్యవస్థకు పునాది అన్నారు.

## వివాహ రద్దు ఫత్వాలు చెల్లవు

- మతపరమైన కమిటీలకు అధికారం లేదు
- మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు

**భోపాల్, ఆగస్ట్ 6 :** మసీదు కమిటీ ఫత్వాపై మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వివాహాన్ని రద్దు చేసే అధికారం ఏ మతపరమైన సంస్థలు, కమిటీలు, లేదా సెమినరీలకు లేదని స్పష్టం చేసింది. కేవలం మసీదు కమిటీ జారీ చేసిన ఫత్వా ఆధారంగా వివాహ బంధం రద్దు అయినట్లు పరిగణించలేమని తేల్చిచెప్పింది. చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించి రాజ్యాంగబద్ధమైన ఫ్యామిలీ కోర్టుల ద్వారానే విడాకులు పొందాల్సి ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది. ఈ సందర్భంగా జస్టిస్ వివేక్ జైన్ ధర్మాసనం తీర్పు వెలువరించింది. విచారణ సందర్భంగా భోపాల్ 'దారుల్-దఫా మసాజిద్ కమిటీ' జారీ చేసిన ఫత్వా ఆధారంగా తన వివాహ బంధం రద్దు అయినట్లు ప్రకటించాలని కోరిన ఓ భర్త అభ్యర్థనను ధర్మాసనం తిరస్కరించింది. ఫత్వాకు స్వతంత్రంగా చట్టపరమైన గుర్తింపు లేదని, అది కోర్టు తీర్పునకు ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేసింది. వివాహ రద్దు వంటి అంశాల్లో తుది నిర్ణయం తీసుకునే అధికారం కేవలం కోర్టులకే ఉంటుందని వెల్లడించింది. అయితే, విడాకులు కోరే వ్యక్తికి చట్టప్రకారం సంబంధిత ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించి విడాకులు పొందే హక్కు ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. వివాహ రద్దు పిటిషన్ దాఖలు చేస్తే, దానిని సంబంధిత కోర్టు నిబంధనల ప్రకారం విచారిస్తుందని పేర్కొంది. కాగా, ఈ తీర్పు మతపరమైన ఫత్వాల చట్టబద్ధత, వివాహ రద్దు పక్రియపై కీలకమైన స్పష్టతను ఇచ్చిందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## అగ్ని-4 పరీక్ష విజయవంతం

**భువనేశ్వర్,ఆగస్ట్6 :** భారత్ మరో కీలక క్షిపణి పరీక్షను విజయవంతంగా పూర్తి చేసింది. అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా ప్రయోగించింది. ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ పరీక్షా కేంద్రం నుంచి విజయవంతంగా ప్రయోగించినట్లు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం (ఆగస్టు 6) వెల్లడించింది ఈ ప్రయోగాన్ని స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పరీక్ష సందర్భంగా క్షిపణికి సంబంధించిన అన్ని ఆపరేషనల్, సాంకేతిక ప్రమాణాలను విజయవంతంగా అందుకున్నట్టు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. అగ్ని శ్రేణి క్షిపణులు భారత వ్యూహాత్మక రక్షణ సామర్థ్యంలో కీలకమైనవి. అగ్ని-4 సుమారు 4,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను చేరుకోగల సామర్థ్యం కలిగిన బాలిస్టిక్ క్షిపణి.



## సచివాలయం ప్రాంగణంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**

**హైదరాబాద్,ఆగస్ట్6 :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సచివాలయ ఆవరణలోని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన పూజల్లో ప్రధాన కార్యదర్శి పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా బోనాలను సమర్పించగా, పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాలు, వివిధ వేషధారణలతో కళాకారుల ప్రదర్శనలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, అధికారులు ఉత్సవాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సుభిక్షం, శాంతి, అభివృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు.

## నకిలీ ఎన్‌వోసిలపై కొనసాగుతున్న విచారణ

- మరో 48 కాలేజీల చిట్టాను అందజేసిన హైడ్రా
- కాలేజీలపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం

**హైదరాబాద్, ఆగస్ట్ 6 :** ఇంటర్ కాలేజీల నకిలీ ఫైర్ ఎన్ఓసీల వ్యవహారంలో పోలీసుల విచారణ కొనసాగుతోంది. మరో 48 కాలేజీల చిట్టాను హైడ్రా అధికారులు పోలీసులకు అందజేశారు. విచారణలో భాగంగా ఒకే తరహాలో నకిలీ ఎన్ఓసీలు తయారు చేసినట్లు గుర్తించారు. దాదాపు 56 కాలేజీలు నకిలీ ఎన్ఓసీలు సమర్పించినట్లు గుర్తించిన హైడ్రా.. మరో 176 కాలేజీలపై విచారణ జరుపుతోంది. ఐదు అంతస్తులలోపు ఉన్న భవనాల అనుమతుల కోసం ఫైర ఎన్ఓసీలను హైడ్రా ఇస్తుంది. ఆఫ్‌లైన్‌లో ఎన్ఓసీలు మంజూరు చేస్తున్న నేపథ్యంలో కాలేజీ యాజమాన్యాలు అక్రమాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్ఓసీల కోసం హైడ్రాకు దరఖాస్తు చేయకుండానే నకిలీలు సృష్టించి ఇంటర్ బోర్డుకు కాలేజీలు సమర్పించినట్లు విచారణలో వెల్లడైంది. ఒక్కొక్క యూనివర్సిటీకి రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలను కాలేజీ యాజమాన్యాలు ఖర్చుపెట్టినట్లు తెలుస్తోంది. ఎన్‌వోసీల కోసం జీహెచ్ఎంసీ, హైడ్రా, ఫైర్ మాజీ డీజీల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు. ఆయా కళాశాలల యాజమాన్యాలను అదుపులోకి తీసుకుని పూర్తి స్థాయిలో విచారణ జరిపితే అసలు వాస్తవాలు బయటపడతాయని పోలీసులు భావిస్తున్నారు. హైడ్రా నివేదిక, పోలీసుల విచారణలో బయటపడ్డ అంశాలను ఆధారంగా చేసుకుని కాలేజీ యజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## విద్యార్థులతో సభకు ఆటంకం

**అనుమతి రద్దుపై మండిపడ్డ రాహుల్**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 6 :** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో విద్యార్థులతో రాహుల్ గాంధీ నిర్వహించాల్సిన సమావేశానికి అనుమతి రద్దు కావడం వివాదంగా మారింది. ఆగస్టు 8న జరగాల్సిన 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమానికి రెండు రోజుల ముందే వేదిక అనుమతిని రద్దు చేశారు. ఈ కార్యక్రమం జరగాల్సిన కేపీ గ్రౌండ్ యజమాని అయిన కాయస్థ పాఠశాల ట్రస్ట్.. అలహాబాద్ హైకోర్టు ఆదేశాలను కారణంగా చూపిస్తూ అనుమతిని వెనక్కి తీసుకుంది. 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమానికి అనుమతి రద్దు చేయడంపై రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. తనను అడ్డుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అయితే, తనను ఎవరూ ఆపలేరని, విద్యార్థుల సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అలహాబాద్ విశ్వవిద్యాలయంలో ఫీజుల పెంపు, సీట్ల తగ్గింపుకు వ్యతిరేకంగా విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్నారని రాహుల్ తెలిపారు. వారి సమస్యలను వినకుండా వారిపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. యువత గొంతును అణచివేయడమే ప్రభుత్వ విధానమని, ప్రశ్నిస్తే లాఠీ దెబ్బలు, నిరసన చేస్తే కేసులు, మాట్లాడితే కఠిన చర్యలు తీసుకుంటున్నారని రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడానికి తాను ప్రయాగ్‌రాజ్‌కు రావాలని నిర్ణయించుకున్నప్పటి నుంచి తన కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. విద్యార్థుల గొంతుకు ప్రభుత్వం భయపడుతోందని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా విద్యార్థులకు అండగా ఉంటానని రాహుల్ స్పష్టం చేశారు.

# ప్రజా సమస్యలపై శ్రద్ధపెట్టని పార్లమెంటు!



**పార్లమెంట్ సమావేశాలు నానాటికీ దిగజారి పోతున్నాయి. అధికార, విపక్షాల పట్టుతో సమావేశాలు సాగడం లేదు. గందరగోళం మధ్యనే ప్రభుత్వం బిల్లులు పాస్ చేసుకుంటూ పోతోంది. విపక్షం కూడా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లు అన్నచందంగా సాగుతోంది. చర్చలు జరక్కుండా ప్రజాధనం వృథా చేస్తున్నారు. వర్షాకాల సమావేశాలు కూడా ఎలాంటి పురోగతి లేకుండా ముగింపు దశకు చేరుకున్నాయి. అసలు మోడీ హయాంలో చర్చలు సాగడం లేదని అనుకుంటుంటే విపక్షం అంతకుమించి అన్నట్లుగా పార్లమెంట్ స్తంభనకే పట్టుబుడతోంది. ఇది నిజంగా పార్లమెంట్ చరిత్రలో మాయని మచ్చగా నిలిచిపోవడం ఖాయం. ఎందుకంటే గత కొన్ని ఏళ్లుగా పరిశీలన చేస్తే అసలు చర్చలు సాగడం లేదు. అర్థవంతమైన చర్చలు అస్సలు చేయడం లేదు. విపక్షలు పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించి, పార్లమెంట్ బయట ఆందోళనలు చేస్తున్నాయి. పార్లమెంట్‌లో ఎన్నో అవకాశాలు ఉంటాయి. ఎన్నో రూల్స్ ఉంటాయి. వారు చర్చించాల్సిన విషయాలను ఈ పద్ధతిలో చర్చించడం లేదు. కేవలం రాజకీయం క ఓసం రచ్చ మార్గాన్ని ఎన్నుకున్నాయి.**

ఇకపోతే స్పీకర్ సమర్థతపైనే చట్టసభల్లో సమస్యలపై చర్చ సాగుతుంది. స్పీకర్ నిజాయితీగా, నిష్పక్ష పాతంగా ఉంటే చట్టసభల్లో అర్థవంతమైన చర్చకు అవకాశం ఉంటుంది. అసెంబ్లీ అయినా పార్లమెంట్ అయినా ఇదే వర్తిస్తుంది. గతంలో కాంగ్రెస్ హయాలో అయినా, ఎన్‌డిఎ హయాంలో అయినా చర్చలు ఫలవంతంగా సాగేవి. ప్రతిపక్షాలు ఎక్కడ ఏ సమస్యలు లేవనెత్తుతాయా అని ప్రభుత్వాలు ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేసేవి. నీలం సంజీవరెడ్డి, బలరామ్ జాకఢ్, శివరాజ్ పాటిల్, పిఎ సంగ్మా ఇలా ఎందరో స్పీకర్లు సభాధ్యక్షస్థానానికి వన్నె తెచ్చారు. సమస్యలపై చర్చలకు అవకాశం ఇచ్చారు. ఇక్కడ చర్చలంటే విపక్షం నుంచే అన్నది వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే గత 12 ఏళ్లుగా అంటే..మోడీ అధికారం చేపట్టిన తరవాత చట్టసభల్లో అర్థవంతమైన చర్చలకు ఆస్కారం లేకుండా పోయింది. అర్థవంతం కాదు కదా అసలు చర్చలకే ఆస్కారం కనిపించడం లేదు. విపక్షం నుంచి ఎవరైనా లేస్తే..స్పీకర్ మైక్ కట్ చేయడం అలవాటు చేసుకున్నారు. అలాంటప్పుడు ప్రజలు ఏమనుకుంటున్నారో ఎలా తెలుస్తుంది. నిజానికి ప్రభుత్వమే చర్చలకు ఆహ్వానించాలి. తమ పాలనా విధానాలపై ప్రజల్లో ఎలాంటి ప్రభావం ఉందో అన్నది తెలుసుకోవాలి. అయితే మోడీ ప్రభుత్వం సమస్యలపై చర్చలను కోరుకోవడం లేదు. చర్చ జరిగితే సమాధానం ఇవ్వడం, ఇరుకున పడడం ప్రభుత్వానికి ఇష్టం లేదన్నది అర్థం అవుతోంది.

ఇలాంటి సందర్భాల్లో స్పీకర్ జోక్యం చేసుకుని ప్రతిపక్ష సభ్యులతో మాట్లాడడం, వారిని అనునయించడం జరిగేది. వారు ఏం కోరుకుంటున్నారో మైక్ ఇవ్వడం ద్వారా తెలుసుకోవచ్చు. కానీ లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఏదేని సమస్యపై లేచి నిలబడితే మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదన్నది ప్రధాన అరోపణ. కనీసం విపక్షనేతకు గౌరవం ఇవ్వాలన్న ఆలోచన కూడా లేకుండా లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా వ్యవహరిస్తున్నారని విపక్ష సభ్యులు పదేపదే అరోపిస్తున్నారు. సమావేశాలను ప్రత్యక్షం గా వీక్షించే వారికి ఇది స్పష్టంగా కనిపిస్తుంది. ఇక ఈ సీజన్‌లో అసలు విపక్ష సభ్యులు కూడా మాట్లాడకుండా పోడియం వద్దకు రావడం, నినాదాలు చేయడం, వెళ్లిపోవడం అలవాటు చేసుకున్నారు. దీంతో స్పీకర్ కూడా సభను వాయిదా వేసి పోతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోడీ సభకు హాజరు కావడం లేదు. విద్యార్థుల సమస్యలు కావచ్చు, ఇతర సమస్యలు కావచ్చు..ప్రధాని మాట్లాడడం లేదు. కేవలం సోషల్ మీడియా ద్వారా తన భావాలను వెల్లడిస్తున్నారు. బలాల సంఖ్య ఎలా ఉన్నా విషయం మాత్రం ప్రజలకు కూడా అర్థం అవుతోంది. పార్లమెంట్ సమావేశాలు ఎన్ని రోజులు జరిగినా మొక్కుబడిగా మమ అనిపిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చ సాగడం లేదు. దేశంలో అవినీతి, అక్రమాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అనేక సమస్యలు ఉన్నాయి. సమావేశాల్లో అనేక అంశాలపై చర్చకు అవకాశం ఉంటుంది.కానీ విపక్షాలకు అలాంటి అవకాశం రావడం లేదు. కేవలం ప్రధాని పడికట్టు పదాలతో ఇచ్చే ఉపన్యాసమే ప్రధాన వార్తగా చలామణి అవుతుంది.

వికసిత భారత్, ఆత్మనిర్భర భారత్ వంటి పడికట్టు పదాలు తప్ప దేశం పురోగతికి సంబంధించి న అంశాలపై చర్చలకు ఆస్కారం కలగడం లేదు. వాజ్‌పేయ్, పివి నరసింహారావు, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ ప్రధానులుగా ఉన్న సమయాల్లోనూ పార్లమెంటులో అర్థవంతమైన చర్చలు సాగేవి. కానీ ప్రస్తుతం చర్చలకు ఆస్కారం లేకపోవడంతో విపక్ష ఎంపిలు పోడియం వద్ద ఆందోళన చేయడం, సభనుంచి బయటకు రావడం రివాజుగా మారింది. ఇకపోతే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ విషయంలో ఎందుకనో విపక్షం వైపు చూడడం మానేశారు. విపక్ష సభ్యుల ప్రస్తావనలకు స్పందించడం లేదు. ఇది ఆయన ఆత్మ పరిశీలన చేసుకోవాలి. అంతేకాదు...తన వైఖరిని మార్చుకుని ప్రజలకోసం పార్లమెంట్ అన్నది గుర్తించాలి. రాజకీయంగా ఎన్ని విభేదాలు ఉన్నా, పార్లమెంటులో చర్చలు జరగాలి. అర్థవంతమైన చర్చలకు ఆస్కారం ఉండాలి. స్పీకర్ అలాంటి అవకాశం కల్పించాలి. గతంలో పనిచేసిన స్పకీర్లు అనుసరించిన తీరును నడవాలి. అప్పుడే పార్లమెంట్ సమావేశాలకు అర్థం ఉంటుంది. అధికార బిజెపి కూడా ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయడానికి సిద్ధంగా ఉండాలి. గత పదేళ్లతో పోలిస్తే 2024 ఎన్నికల్లో బిజెపి బలం గణనీయంగా పడిపోయింది. ఇప్పుడు ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో కొనసాగుతున్నామని గుర్తించాలి. ఇంకా మభ్య పెట్టే పనులతో ప్రజల్లో మరింత పలచన కాకుండా చూసుకుంటే మంచిది. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ప్రధాని సభకు రావడం మర్యాద. విపక్షాలకు కూడా ఆయన సూచనలు చేయవచ్చు. కానీ మంత్రులతోనే పనికానిచ్చేద్దాఆమంటే సరికాదు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. దీనిని గుర్తించకుంటే ప్రజలు తగిన సమయంలో స్పందిస్తారు.

# విదేశీ విరాళాలపై ఆంక్షల కత్తి

**కొత్త బిల్లుతో దేశంలో సేవాకార్యక్రమాలకు గండి**

**కేంద్రం తీరుపై మండిపడ్డ ఎంపి శశిథరూర్**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 6 :** దేశంలో విదేశీ నిధుల అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు, పారదర్శకతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం విదేశీ నిధుల నియంత్రాణ చట్టం సవరణ-2026 బిల్లును తీసుకువచ్చింది. దీనిద్వారా ప్రస్తుతం అమలులో ఉన్న విదేశీ విరాళాల నియంత్రణ చట్టం మరింత కఠినతరం కానుంది. ఈ బిల్లును వచ్చే వారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలని కేంద్రం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లు-2026 పై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టనున్న ఈ కొత్త బిల్లు దేశంలోని పౌర సమాజంపై ప్రభుత్వ నియంత్రణను మరింత పెంచేలా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు.. స్వచ్ఛంద సంస్థలు, మానవ హక్కుల సంఘాలను సమాజంలో అభివృద్ధి భాగస్వాములుగా కాకుండా, విదేశీ ప్రమేయాలుగా చూపేలా ఉన్నాయని శశిథరూర్ ఆరోపించారు. 'ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ రద్దయినా, గడువు ముగిసినా లేదా సరెండర్ చేసినా.. ఆ సంస్థలకు చెందిన విదేశీ విరాళాలు, ఆస్తుల నిర్వహణను ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకునేందుకు ఈ కొత్త బిల్లు వీలు



కల్పిస్తోంది. దీనికోసం ప్రత్యేకంగా ఒక 'అధికార యంత్రాంగం' ఏర్పాటుకు కేంద్రం పావులు కదుపుతోంది. ఈ నిబంధన ద్వారా పాలనా పరమైన నిర్ణయాలతోనే స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నడిచే ఆస్పత్రులు, విద్యాసంస్థలు, భవనాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రమాదం ఉంది' అని థరూర్ ఆరోపించారు. కేరళలో పలు ఛారిటబుల్ ట్రస్ట్‌లు, పాఠశాలలు, ఆస్పత్రులు గత శతాబ్ద కాలంగా కులమతాలకు అతీతంగా పేదలకు వైద్య, విద్యా సేవలు అందిస్తున్నాయని థరూర్ గుర్తుచేశారు. ఈ సంస్థలు స్థానిక విరాళాలతో పాటు విదేశీ నిధుల ద్వారా ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చుకుంటూ పేదలకు అండగా నిలుస్తున్నాయని చెప్పారు. ఎఫ్‌సీఆర్‌ఏ నిబంధనల పేరుతో ఈ సంస్థలను వేధించడం, ఆస్తులను జప్తు చేయడం వల్ల చివరికి నష్టపోయేది సామాన్య ప్రజలేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కఠినమైన నిబంధనల వల్ల విదేశీ నిధులు 87 శాతం మేర తగ్గిపోయి వేలాది సేవా సంస్థలు మూతపడ్డాయని, ఇప్పుడు తెస్తున్న ఈ కొత్త బిల్లు వాటిని శాశ్వతంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని థరూర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కక్షసాధింపు చర్యల వల్ల కోట్లాది మంది పేదలకు అందుతున్న వైద్య, విద్య సేవలు నిలిచిపోతాయని హెచ్చరించారు.

# రోడ్డుప్రమాదంలో గ్యాంగ్‌స్టర్ అతీక్ కొడుకు దుర్మరణం

**కారు డివైదర్‌ను ఢీకొనడంతో ప్రమాదం**

**లక్నో, ఆగస్ట్ 6 :** ఉత్తర్‌ప్రదేశ్ గ్యాంగ్‌స్టర్ అతీక్ అహ్మద్ చిన్నకొడుకు అబన్ అహ్మద్ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. జైల్లో ఉన్న తన సోదరుడిని కలిసేందుకు వెళ్తుండగా.. ఝాన్సీ ప్రాంతంలో హైవేపై అతడు ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాద సమయంలో వాహనంలో అబన్ తో పాటు మరో నలుగురు వ్యక్తులు ఉన్నారు. ప్రమాద తీవ్రతకు కారు ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. అబన్‌తో పాటు మరో వ్యక్తి కూడా మృతి చెందారు. అతి వేగమే ఘటనకు కారణమని పోలీసులు ప్రాథమికంగా వెల్లడించారు. గ్యాంగ్‌స్టర్, మాజీ ఎంపీ అతీక్ అహ్మద్‌పై దోపిడీ, కిడ్నాప్, హత్య కేసులు ఉన్నాయి. బీఎస్పీ ఎమ్మెల్యే రాజు పాల్ హత్య కేసులో కీలక సాక్షి అయిన ఉమేశ్ పాల్‌ను హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే ఓ కేసులో జైల్లో ఉన్న అతీక్, అతడి సోదరుడిని 2023 ఏప్రిల్‌లో పోలీసులు వైద్య పరీక్షలకు తీసుకెళ్తుండగా.. ముగ్గురు దుండగులు వారిని కాల్చి చంపారు. కాగా.. పాల్ హత్య కేసులో నిందితుడిగా ఉన్న అతీక్



మూడో కుమారుడు అసద్ పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ఇక, అతీక్ మరో ఇద్దరు కుమారులు మహమ్మద్ ఉమర్, మహమ్మద్ అలీ ఇతర కేసుల్లో జైల్లో ఉన్నారు. ఉమేశ్ పాల్ హత్య కుట్రలో సంబంధం ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న అతీక్ భార్య పర్వీన్ పరారీలో ఉంది. ఇప్పుడు అబన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఒకప్పుడు ఈ గ్యాంగ్‌స్టర్ కుటుంబం తూర్పు ఉత్తర్‌ప్రదేశ్‌లోని పలు ప్రాంతాలను నియంత్రించింది.

# గోవా లైంగిక దాడి కేసు

**తరుణ్ తేజ్‌పాల్‌ను దోషిగా తేల్చిన బాంబే హైకోర్టు**

**ముంబై, ఆగస్ట్ 6 :** 2013 నాటి లైంగిక దాడి కేసులో తెహెల్కా మాజీ సంపాదకుడు తరుణ్ తేజ్‌పాల్‌ను బాంబే హైకోర్టులోని గోవా ధర్మాసనం దోషిగా నిర్ధారించింది. 2021లో మాపుసా కోర్టు ఇచ్చిన తీర్పును ఈ ధర్మాసనం రద్దు చేసింది. జస్టిస్ డాక్టర్ నీలా గోఖలే, జస్టిస్ అమిత్ జమ్సందేకర్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ తీర్పును వెలువరించింది. ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద తరుణ్ తేజ్‌పాల్‌ను దోషిగా నిర్ధారించింది. అతడికి విధించిన శిక్షను ధర్మాసనం ప్రకటించనుంది. గోవా ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపించారు. కుమార్తె వయస్సు ఉన్న యువతితో అతడు ఈ విధంగా వ్యవహరించారని తెలిపారు. బాధితురాలు పదే పదే తిరస్కరించినప్పటికి తేజ్‌పాల్ తన ప్రయత్నాలను కొనసాగించాడని పేర్కొన్నారు. అదీకాక మ్యాగజైన్ సంపాదకుడిగా అతడు గౌరవమైన స్థానంలో ఉన్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నిందితుడు తరుణ్ తేజ్‌పాల్‌కు గరిష్టంగా శిక్ష విధించాలని ఈ సందర్భంగా కోర్టుకు తుషార్ మెహతా విజ్ఞప్తి చేశారు. 2013లో గోవాలోని ఓ రిసార్ట్ వేదికగా తెహెల్కా పత్రిక థింక్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా మ్యాగజైన్ సంపాదకుడు తరుణ్ తేజ్ పాల్ తనపై లైంగిక దాడి చేశాడని సహోద్యోగి ఆరోపించారు. మరికొద్దిసేపట్లో కోర్టు అతడికి శిక్ష విధించనుంది. ఈ నేపథ్యంలో తేజ్‌పాల్ స్పందించారు. తనపై దయ చూపాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. తన వయస్సు 62 ఏళ్లని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తాను బాధితుడిని నమ్ముతున్నానని అన్నారు. తనకు భార్య కూడా ఉందని పేర్కొన్నారు. అంతుకు మించి చెప్పడానికి ఏమీ లేదంటూ తేజ్‌పాల్ ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.



# పదవుల భర్తీలో కాంగ్రెస్ తీరు సరిగా లేదు

**పెదవి విరిచిన ఎమ్మెల్సీ కోదండరామ్**

**హైదరాబాద్, ఆగస్ట్ 6 :** పదవుల భర్తీపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి సరిగా లేదని ఎమ్మెల్సీ కోదండరాం పెదవి విరిచారు. పదవుల భర్తీ ఆలస్యం చేయడం వల్ల కలిగే ప్రయోజనం లేదన్నారు. గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొ. జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగుల అంశంలో బీఆర్ఎస్ హయాంలో కంటే ఈ ప్రభుత్వంలో స్పందన బాగుందని రేవంత్ రెడ్డి సర్కారును ప్రశంసించారు. ప్రభుత్వంలో తమ భాగస్వామ్యంపై సంప్రదింపులు చేస్తున్నామని వివరించారు. మాకు ఎమ్మెల్సీ, కార్పొరేషన్ ఛైర్మన్లు ఇస్తామన్నారని గుర్తు చేశారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ అంశంపై చర్చిస్తున్నామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ వైఖరితో ఈ ప్రభుత్వంపై ఆర్థిక భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జాతిపిత జయశంకర్ సర్ అని విద్యార్థులే ప్రకటించుకున్నారని ఎమ్మెల్సీ కోదండరాం వివరించారు.

# నీట్ శిక్షణ విద్యార్థి బలవన్మరణం

**హైదరాబాద్ బేగంపేటకు చెందిన వైష్ణవిగా గుర్తింపు**

**విజయవాడ, ఆగస్ట్ 6 :** కృష్ణా జిల్లాలోని కానూరులో విషాదం చోటు చేసుకుంది. నీట్ శిక్షణ పొందుతున్న హైదరాబాద్ యువతి వైష్ణవి(19) బలవన్మరణానికి పాల్పడింది. హైదరాబాద్‌లోని బేగంపేటకు చెందిన వైష్ణవి నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ కోసం కృష్ణా జిల్లాలోని శ్రీ భారతి ఇన్‌స్టిట్యూట్‌లో చేరింది. మూడు వారాల కిందటే అక్కడకు వచ్చిన వైష్ణవి.. కుటుంబానికి దూరంగా ఉండలేకపోయింది. ఇంత దూరంలో ఉండి చదవలేనంటూ తల్లిదండ్రులకు ఫోన్ చేసిన తన బాధను చెప్పుకుంది. అయితే బిడ్డ భవిష్యత్తు బాగుండాలని భావించిన తల్లిదండ్రులు.. వైష్ణవికి సర్దిచెప్పారు. ఇంతలోనే తాను ఉంటున్న హాస్టల్ గదిలో యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హాస్టల్ సిబ్బంది ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యువతి మృతి సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేయడంతో వారంతా హుటాహుటిన కృష్ణాజిల్లాకు చేరుకున్నారు. చదువు కోసం వెళ్లిన తమ బిడ్డ ఇలా విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అయితే, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అరుణాచల్‌ప్రదేశ్‌లో భూప్రకంపనలు

**రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 5.1గా నమోదు**

**ఇటానగర్, ఆగస్ట్ 6 :** అరుణాచల్‌ప్రదేశ్‌లోని అప్పర్ సియాంగ్ జిల్లాలో గురువారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దాని తీవ్రత 5.1గా నమోదయింది. ఈ భూకంపం వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం కానీ జరగలేదని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ వెల్లడించింది. ఈ రోజు తెల్లవారుజాము 5.45 గంటలకు అప్పర సియాంగ్ జిల్లాలోని పాంగిన్‌కు 116 కిలో మీటర్ల దూరంలో.. 11 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు వివరించింది. అయితే ఈ భూకంపానికి ముందు మూడు చిన్న ప్రకంపనలు చోటు చేసుకున్నాయని పేర్కొంది. అవి ఉదయం 3.40 గంటలకు 5 కిలోమీటర్ల లోతులో 2.8 తీవ్రతతో ఒకటి.. దీని తర్వాత 3.55 గంటలకు 3.2 తీవ్రతతో మరొకటి వచ్చిందని వివరించింది. అలాగే ఉదయం 4.34 గంటలకు 2.8 తీవ్రతో ఇంకొకటి వచ్చిందని తెలిపింది. పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని అధికారులు తెలిపారు. రోజైపు ఇదే రాష్ట్రంలోని షి యోమి జిల్లాలో బుధవారం భూకంపం సంభవించింది. ఇది 5.0 తీవ్రతతో వచ్చింది. ఈ జిల్లాకు ఈశాన్యంగా 60 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం నమోదైంది. ఇక్కడ కూడా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. దేశంలోని ఈశాన్య ప్రాంతం భూకంపం జోన్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ ప్రాంతంలో తరచూ అత్యధికంగా భూ ప్రకంపనలు జరుగుతున్నాయి.

# తమిళనాట మరోమారు తమిళ్ తాయ్ వాళ్తు' వివాదం

**ప్రొటోకాల్ ఉల్లంఘన జరిగిందని పలువురు ఎంపి ఆరోపణ**

**చెన్నై, ఆగస్ట్ 6 :** తమిళనాడులో రాష్ట్ర గీతమైన 'తమిళ్ తాయ్ వాళ్తు' ఆలాపన ప్రొటోకాల్ మరోసారి రాజకీయ వివాదానికి దారితీసింది. తిరునెల్వేలిలో జరిగిన మనోన్మణీయం సుందరనార్ యూనివర్సిటీ 33వ స్నాతకోత్సవంలో ప్రొటోకాల్ ఉల్లంఘన జరిగిందని ఎంపీలు ఆరోపించారు. కార్యక్రమంలో ముందుగా 'వందే మాతరం', అనంతరం జాతీయ గీతం, ఆ తర్వాత మూడో స్థానంలో 'తమిళ్ తాయ్ వాళ్తు' ఆలపించడాన్ని వారు తీవ్రంగా తప్పుబట్టారు. రాష్ట్ర గీతాన్ని ఈ విధంగా మూడో స్థానంలో ఉంచడం తమిళ ప్రజల మనోభావాలను దెబ్బతీ యడమే కాకుండా.. ఆ గీత రచయిత సుందరనార్‌ను కూడా అవమానించడమేనని లేఖలో పేర్కొన్నారు. ఈ అంశంపై కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం, ఎంపీ కార్తి చిదంబరం, చిరుతైగల్ కచ్చి నేత తిరుమావలవన్‌తో పాటు మొత్తం 21 మంది ఎంపీలు గవర్నర్‌కు సంయుక్తంగా లేఖ రాశారు. గత ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం.. ప్రభుత్వ, విశ్వవిద్యాలయ కార్యక్రమాల్లో ప్రారంభంలో 'తమిళ్ తాయ్ వాళ్తు', ముగింపులో జాతీయ గీతం ఆలపించాలని వారు డిమాండ్ చేశారు. వరుసగా మూడోసారి ప్రొటోకాల్‌లో మార్పులు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొంటూ, భవిష్యత్తులో ఇలాంటి వివాదాలకు తావులేకుండా రాజ్‌భవన్ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని ఎంపీలు విజ్ఞప్తి చేశారు.



# మెటా తీరుపై మండిపడ్డ కేజ్రీవాల్

**తన ఖాతాను నియంత్రిండంపై ఆక్షాపణ**

**ప్రధాని మోడీ ఒత్తిళ్లకు తలొగ్గద్దని సూచన**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 6 :** ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటాపై ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్‌లో తన ఖాతాను ఎందుకు నియంత్రించారని ఆయన ప్రశ్నించారు. తన అకౌంట్ నియంత్రణపై మెటా అధికారులను ప్రశ్నిస్తే సరిగా సమాధానం ఇవ్వడం లేదని, ఈమెయిల్ పంపినా కూడా స్పందించడం లేదన్నారు. ప్రధాని మోదీ ఒత్తిళ్లకు తలగొద్దని మోటా సంస్థకు కేజ్రీవాల్ సూచించారు. తన సోషల్ మీడియా ఖాతాను భారత్‌లో ఎందుకు నిలిపివేశారో సంస్థ నుంచి ఎలాంటి స్పష్టత రాలేదని కేజ్రీవాల్ మండిపడ్డారు. మెటా ఇండియా కార్యాలయంలో మౌఖికంగా విచారించినా ఎలాంటి సరైన సమాధానం రాలేదని, తాము పంపిన ఈమెయిల్స్‌కు సాధారణ రసీదులు మాత్రమే వస్తున్నాయని ఆరోపించారు. ఇది చాలా చెత్త సేవ అంటూ అసహనం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి ఒత్తిళ్లకు తలవంచకండి.. లేదంటే భవిష్యత్తులో దేశంలో ప్రధాని ఖాతా ఒక్కటే నడుపుకోవడానికి మిమ్మల్ని అనుమతి స్తారు' అంటూ ఆయన ఎద్దేవా చేశారు. మెటా సంస్థ తన సేవలను మరింత బాధ్యతాయుతంగా నిర్వర్తించా లని కేజ్రీవాల్ అన్నారు. కాగా, దేశంలో మెటా సంస్థపై ప్రస్తుతం తీవ్రస్థాయిలో ప్రభుత్వ నిఘా, విచారణ కొనసాగుతున్న తరుణంలో కేజ్రీవాల్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

## పాముకాటుకు విద్యార్థి మృతి



**నారాయణపేట,ఆగస్టు 6(జనం వార్త):** నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో విషాద ఘటన చోటుచేసుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం,మధ్యాహ్న భోజనం అనంతరం కిటికీ పక్కన కూర్చున్న 3వ తరగతి విద్యార్థి రంజిత్‌ను కిటికీలో నుంచి వచ్చిన పాము కాటేసింది. వెంటనే ఉపాధ్యాయులు బాలుడిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనతో విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పాఠశాల ఆవరణలో అపరిశుభ్రత, పిచ్చి మొక్కలు ఉండటమే ఈ విషాదానికి కారణమని గ్రామస్తులు ఆరోపించారు. ఘటనపై ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. పాఠశాల పరిసరాలను వెంటనే శుభ్రపరిచి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



## ఘనంగా జయశంకర్ సార్ జయంతి

**దుబ్బాక ప్రతినిధి ఆగస్టు 6 (జనం వార్త) :** ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా దుబ్బాక మున్సిపాలిటీ కార్యాలయంలో ఫోటోకు పూలమాలవేసి మున్సిపల్ చైర్ పర్సన్ వైస్ చైర్ పర్సన్,కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ అధికారులు ఘనంగా నివాళులర్పించారు.(ఆగస్టు 6, 1934 -- జూన్ 21, 2011) తెలంగాణ ఉద్యమ ప్రధాన సిద్ధాంతకర్త, ఆచార్యులు మరియు గొప్ప ప్రచారకర్త. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే తన జీవితాశయంగా భావించి, 1952 నుంచి మరణించే వరకు ఉద్యమానికి దిక్సూచిగా నిలిచారు.తన జీవితాన్ని తెలంగాణ ప్రజల కోసం అంకితం చేశారు. సమైక్యాంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ విద్యా ఉద్యోగ రాజకీయ నీటి పంపిణీలో తీవ్రంగా జరిగిన అన్యాయాన్ని గురించి తెలంగాణ నాలుదిక్కుల ప్రజలకు అర్థమయ్యే విధంగా ప్రసంగాలు చేశారు. ప్రజలను చైతన్యం చేసి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించేలా తన వంతు ప్రయత్నం చేశారు.

# ఏపీ కేబినేట్ కీలక నిర్ణయాలు

- దిశ బిల్లు-2019, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు-2024ల ఉపసంహరణ
- యూడీఏల పునర్వ్యవస్థీకరణకు మంత్రివర్గం ఆమోదం
- రెండు కొత్త ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు
- కొత్త జిల్లాలకు 15 కొత్త డీఈవో పోస్టులు
- అమరావతి క్యాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్‌కు రూ.1002.49 కోట్లు కేటాయింపు
- వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి



**అమరావతి,ఆగస్ట్6 :** పలు కీలక నిర్ణయాలకు ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో 34 అజెండా అంశాలపై చర్చించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ యాక్ట్-2026, ఏపీ పీపీపీ పాలసీ-2026 మంసాయిదాకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దిశ బిల్లు-2019, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు-2024లను ఉపసంహరించి.. మరింత పటిష్ఠ చట్టాల రూపకల్పనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కేబినేట్ అనంతరం వివరాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. మున్సిపల్ భూముల లీజు గడువు పెంపునకు చట్టసవరణల ప్రతిపాదన, యూడీఏల పునర్వ్యవస్థీకరణకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. పాదచారుల భద్రత పాలసీ-2026, రెండు కొత్త ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు, కొత్త జిల్లాలకు 15 కొత్త డీఈవో పోస్టులు, అమరావతి క్యాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్‌కు రూ.1002.49 కోట్లు కేటాయింపునకు క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ట్విన్ టవర్స్ నిర్మాణ బాధ్యతలను ఎల్అండ్‌టీకి అప్పగించేందుకు అంగీకారం తెలిపింది. అసెంబ్లీ, హైకోర్టు డిజైన్ల కోసం అదనపు నిధులు, అమరావతి భూ కేటాయింపులపై జీవోఎం సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. 'అమరావతి ఐ' ప్రాజెక్టుకు రీ-టెండర్లకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏదుల ముస్తూరులో 19.55 ఎకరాలు ఎపిఐఐసికి బదిలీకి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. తిమ్మసముద్రంలో 13.45 ఎకరాలు సియుడిఎకు బదిలీ చేసేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. కొత్త జిల్లాలకు అనుగుణంగా యుడిఎ పునర్వ్యవస్థీకరణకు మంత్రివర్గం అంగీకారం తెలిపిందని, వాటి సంఖ్య 21 నుంచి 23కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కండలేరు నుంచి పరిశ్రమల క్లస్టర్‌కు నీటి సరఫరాకు కేబినెట్ ఆమోద ముద్ర వేసిందన్నారు. విజయవాడ ఆటోనగర్ కాలనీవాసులకు జఆ÷ూ హక్కులను క్రమబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. 400 హౌసింగ్ యూనిట్ల భూ సమస్యకు కేబినెట్‌లో పరిష్కారం చూపామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ భూ వివాదాల పరిష్కారానికి సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. అమరావతి 'ఐ' ప్రాజెక్టుకు సవరించిన టెండర్లకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఎత్తైన అమరావతి ఐ నిర్మాణానికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించేందుకు కేబినెట్ అంగీకారం తెలిపిందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు 'ఆమ్నిబస్ చట్టం-2026' చట్టాన్ని తీసుకొచ్చామని, పెట్టుబడులకు అడ్డంకుల తొలగింపే ఆమ్నిబస్ చట్టం లక్ష్యమని పార్థసారథి స్పష్టం చేశారు. కుప్పం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ భూసేకరణకు ప్రత్యేక పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. డి-ఫామ్ లేని సాగుదారులకు ఎకరాకు రూ.12.44 లక్షల పరిహారం అందించేందుకు కేబినెట్ అంగీకారం తెలిపిందన్నారు. అమరావతిలో 47 అంతస్తుల ట్విన్ టవర్స్ నిర్మాణానికి ఆమోదం లభించిందని, ట్విన్ టవర్స్‌లో కార్పొరేట్, క్వాంటమ్ సంస్థలకు అవకాశం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. హైకోర్టు భవనం రీ-డిజైన్ ప్రతిపాదనకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఏపీ పిపిపి పాలసీ-2026కు మంత్రిమండలి నుంచి ఆమోదం ముద్ర పడినట్లు చెప్పారు. ఖఖఖ ప్రాజెక్టులకు రూ.1,500 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడించారు. భారీ పెట్టుబడుల ఆకర్షణెళి కొత్త పిపిపి పాలసీ లక్ష్యమని తెలిపారు. మోతడకలో 2,344 ఎకరాల్లో ల్యాండ్ పూలింగ్‌కు ఆమోద ముద్ర పడిందన్నారు. హైస్పీడ్ రైలు, ఇన్నర్ రింగ్ రోడ్డుకు భూముల సమీకరణకు మంత్రివర్గం అంగీకారం తెలిపిందని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.

## జగన్ అండ్ కోని కంట్రోల్ చేయడం 2 నిముషాల పని

- రాజకీయ ముసుగులో రౌడీయిజం చేస్తున్న వైకాపా
- డిఎస్సీపై కావాలనే నానా యాగీ చేస్తున్నారు
- పొగాకు రైతుల వద్దకు వెళ్లి హంగామా చేశారు
- రైతన్నల పొలాలను ధ్వంసం చేసి..వారిని క్షోభ పెట్టారు
- జగన్ అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలి
- కేబినేట్‌లో మంత్రులతో సిఎం చంద్రబాబు



**అమరావతి,ఆగస్ట్6 :** జగన్ అండ్ కో చేస్తున్న అరాచకాలను కంట్రోల్ చేయడానికి తనకు రెండు నిమిషాలు చాలని సీఎం చంద్రబాబు మంత్రులతో అన్నారు. కానీ రాజకీయ ముసుగులో వారు నేరాలు చేస్తున్నారని ఆగ్రహించారు. డీఎస్సీపై చేస్తున్న రాద్ధాంతాన్ని కూడా అందరూ గమనిస్తున్నారని తెలిపారు. అన్ని విషయాలు డీఎస్సీపై మనం ప్రజలకు వివరించామని అన్నారు. వైసీపీ నేతలు కోర్టులతో కూడా చీవాట్లు పడ్డారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. మూడున్నర గంటల పాటు ఆయా అంశాలపై ముఖ్యమంత్రి చర్చించారు. స్థానిక ఎన్నికలకు మంత్రులు, కూటమి నేతలు సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. కోర్టుల చీవాట్లు పెట్టినా వైసీపీ నేతలు యాగీ చేస్తున్నారని ఆగ్రహించారు. డీఎస్సీపై వైసీపీ నేతలు ఇప్పుడు ధర్నాలు చేయడం ఏంటని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. వైసీపీ నేతలకు అసలు రిజర్వేషన్ల గురించి తెలియదని విమర్శించారు. డీఎస్సీలో హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్లపై.. అందరికీ తెలపాల్సిన బాధ్యత మంత్రులదేనని ఆదేశించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిన్న దేవరపల్లిలో పర్యటన సందర్భంగా రైతన్నల పొలాలను గొడ్డలి పార్టీ శ్రేణులు నాశనం చేశాయని ధ్వజమెత్తారు. ఓ మహిళ చిరు వ్యాపారి పొట్టగొట్టడంతో పాటు హిందూ దేవుళ్ల చిత్ర పటాలు పగలకొట్టడం ఆక్షేపణీయమని అన్నారు. పొగాకు బేళ్లను తొక్కి నాశనం చేసి పరామర్శ ముసుగు తగిలించుకున్నారని ఆగ్రహించారు. అనేకమంది రైతులు తనకు మెసేజ్‌లు పంపారని తెలిపారు. తమ పంట దెబ్బతిందని అన్నదాతలు తనకు వివరించారని అన్నారు. చివరకు జగన్ పరామర్శలు అంటే జనం భయపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. ఈ నెలాఖరుకు వెలుగొండ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రకాశం జిల్లా ప్రజలకు తాగునీటి కోసం నీళ్లు ఇస్తామని వెల్లడించారు. ఎల్‌నినో గురించి మంత్రులు ప్రజలకు తెలపాలని సూచించారు. ఇంత వర్షాభావం ఉన్న కూడా మంచినీటికి కూడా మనం నీళ్లు ఇస్తున్నామనేది ప్రజలకు వివరించాలని అన్నారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభం సందర్భంగా తొలిసారి థింసా గిరిజన నృత్యానికి గిన్నిస్ రికార్డు వచ్చిందని ప్రస్తావించారు. ఈ ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం ఉత్తరాంధ్ర ప్రజల్లో ఓ సెంటిమెంట్‌ను తీసుకువచ్చిందని తెలిపారు. తమ ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. అక్కడ ల్యాండింగ్ కూడా సముద్రం మీద నుంచి వచ్చే విధంగా ఏర్పాటు చేశామని వివరించారు. స్వర్ణాంధ్ర, వికసిత భారత్ ఈ రెండు స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మంత్రుల ప్రసంగాల్లో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. క్వాంటం వ్యాలీ జనవరిలో ప్రారంభమవు తుందని ప్రకటించారు. 'దిశా' అనేది అసలు చట్టం రూపం నోచుకోలేదని సీఎం తెలిపారు. అయినా 'దిశా' పోలీస్ స్టేషన్లు, వాహనాలని చెప్పి హడావుడి చేశారని దుయ్యబట్టారు. 'దిశా' చట్టం అని పంపితే కేంద్రప్రభుత్వం తిరస్కరించి వెనక్కు పంపిందని ప్రస్తావించారు. రాజకీయ పార్టీల ముసుగులో క్రిమినల్స్ తయారవుతున్నారని మండిపడ్డారు. ప్రశాంతంగా ఉండే జిల్లాల్లో శాంతిభద్రతల సమస్యను సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. జగన్ మీటింగ్ అంటే లైసెన్స్ ఇచ్చినట్లుగా మందు తాగించి ప్రజలను తరలిస్తున్నారని ధ్వజమెత్తారు. గంజాయి బ్యాచ్‌ను జెన్ జీ అని చెప్పుకోవడం గొడ్డలి పార్టీకే చెల్లిందని ఎద్దేవా చేశారు. పొగాకు రైతులకు కూటమి ప్రభుత్వం చేస్తున్న లబ్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను మంత్రులే తీసుకోవాలని ఆదేశించారు. ఆక్వా రైతులకు ఆక్వాజోన్, నాన్ ఆక్వాజోన్ అనే తేడా లేకుండా రూ.1100కోట్లు విద్యుత్ రాయితీలు ఇచ్చామని ప్రస్తావించారు. ఆక్వా ఫీడ్ ఎక్స్‌పోర్ట్ 50శాతం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసిందని తెలిపారు. అగ్రిగోల్డ్ అంశంపై కేబినెట్‌లో సీఎం చంద్రబాబు సుదీర్ఘంగా చర్చించారు.

## తెహాల్కా ఎడిటర్‌కు పదేళ్ల జైలు శిక్ష

- లైంగిక దాడి కేసులో శిక్ష ఖరారు చేసిన కోర్టు
- రెండువారాల్లోగా లొంగిపోవాలని ఆదేశం
- రాజకీయంగా తనపై కక్షసాధింపు చేపట్టారన్న తేజ్‌పాల్



**ముంబై,ఆగస్ట్6 :** తెహల్కా మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు పదేళ్ల జైలు శిక్ష పడింది. 2013లో నమోదైన లైంగిక దాడి కేసులో బాంబే హైకోర్టు గోవా బెంచ్ కీలక తీర్పు వెలువరించింది. పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా కూడా విధించింది. అతడు రెండు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది. 2013లో జూనియర్ సహోద్యోగినిపై అత్యాచారం చేసిన కేసులో తేజ్‌పాల్‌ను దోషిగా తేల్చిన బాంబే హైకోర్టు తాజాగా శిక్షను ఖరారు చేసింది. గతంలో ట్రయల్ కోర్టు ఈయనను నిర్దోషిగా ప్రకటించింది. ఆ తీర్పును బాంబే హైకోర్టు రద్దు చేసింది. 2013లో గోవాలో జరిగిన ఒక కార్యక్రమంలో హోటల్ లిఫ్ట్‌లో తనపై తేజ్‌పాల్ లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు ఆరోపించారు. దీంతో అదే ఏడాది నవంబర్‌లో అతడిని అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం 2021లో గోవా ట్రయల్ కోర్టు తేజ్‌పాల్‌ను నిర్దోషిగా ప్రకటించింది. అయితే ఆ తీర్పును గోవా ప్రభుత్వం బాంబే హైకోర్టులో సవాలు చేసింది. అప్పీల్‌ను విచారించిన హైకోర్టు ట్రయల్ కోర్టు తీర్పును కొట్టివేస్తూ తేజ్‌పాల్‌ను దోషిగా నిర్ధారించింది. పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. కాగా, ఈ కేసులో తానే బాధితుడినని తేజ్‌పాల్ పేర్కొన్నారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, తాను నిర్దోషినని పేర్కొంటూ ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేస్తానని వెల్లడించారు. తీర్పు వెలువడిన అనంతరం మీడియాతో మాట్లాడిన తేజ్‌పాల్, 'నేను ఎలాంటి నేరమూ చేయలేదు. ఈ తీర్పుతో నేను ఏకీభవించడం లేదు. న్యాయం కోసం సుప్రీం కోర్టును ఆశ్రయిస్తాను' అని చెప్పారు. ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్, సురేంద్ర గాడ్లింగ్ లాగానే తానూ రాజకీయ కక్షసాధింపునకు గురయ్యానని తేజ్‌పాల్ పేర్కొన్నారు. తెహెల్కా చేసిన దర్యాప్తు కథనాల వల్ల కొందరి రాజకీయ ప్రయోజనాలకు నష్టం కలిగిందని, అందుకే తనపై కేసు పెట్టారని ఆయన ఆరోపించారు. కోర్టు తీర్పు అనంతరం తరుణ్ తేజ్‌పాల్ మీడియాతో మాట్లాడారు. తనపై కొందరు గత 13 ఏళ్లుగా ప్రతీకారంతో రగిలిపోతున్నారని అన్నారు. ఈ కేసులో తనను పదిసార్లు నిర్దోషిగా ప్రకటించి విడుదల చేసే ఆధారాలు తన వద్ద ఉన్నాయని చెప్పారు. న్యాయవ్యవస్థపై తనకు పూర్తి విశ్వాసం ఉందని, దీనిపై త్వరలో సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్, భీమా కోరేగావ్ కేసులో అరెస్టైన సురేంద్ర గాడ్లింగ్ పేర్లను తేజ్‌పాల్ ప్రస్తావించారు. వారిలాగే తానూ రాజకీయ కక్షసాధింపునకు గురైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, విచారణ సందర్భంగా గోవా ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కీలక వాదనలు వినిపించారు. బాధితురాలు పలుమార్లు నిరాకరించినప్పటికీ తేజ్‌పాల్ వినలేదని, 'నో అంటే నో' అనే ప్రాథమిక సూత్రాన్నే ఆయన పట్టించుకోలేదని కోర్టుకు వివరించారు. నేర తీవ్రత దృష్ట్యా ఆయనకు గరిష్ఠ శిక్ష విధించాలని కోరారు. అయితే, తనకిప్పుడు 62 సంవత్సరాలని, తానూ బాధితుడినేనని నమ్ముతున్నానని కోర్టుకు తేజ్‌పాల్ విన్నవించారు. తనకు భార్య ఉందని, శిక్ష విషయంలో దయచేసి కనికరం చూపాలని కోరారు. విచారణ అనంతరం న్యాయస్థానం తన తీర్పులో కీలక వ్యాఖ్యలు చేసింది. తెహెల్కా ఎడిటర్-ఇన్-చీఫ్‌గా తేజ్‌పాల్ ఉన్న సమయంలో బాధితురాలు ఆయన కింద పని చేసిందని, వారి మధ్య అధికార అసమానత స్పష్టంగా ఉందని పేర్కొంది. ఆ వృత్తిపరమైన ఆధిపత్యాన్ని ఆయన దుర్వినియోగం చేశారని అభిప్రాయపడింది. ఈ సందర్భంగా బాధితురాలిపై జరిగిన అత్యాచారం నిజమేనని నిర్ధారించి తీర్పు వెలువరించింది. కాగా, గోవాలో 2013 నవంబర్ 7, 8 తేదీల్లో థింక్‌ఫెస్ట్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హోటల్ లిఫ్ట్‌లో తేజ్‌పాల్ తనపై రెండు సార్లు అత్యాచారం చేశాడని పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దాదాపు 13 ఏళ్ల తర్వాత కోర్టు అతనిని దోషిగా తేల్చింది.

## గోపాలపురం పాఠశాలకు రూ.25లక్షలు మంజూరు

- ముఖ్యమంత్రి ఆదేశాలతో పాఠశాలను సందర్శించిన కలెక్టర్
- ఉపాధ్యాయినితో మాట్లాడిన సీఎం ప్రిన్సిపల్‌సెక్రటరీశ్రీధర్



**హైదరాబాద్, ఆగస్ట్6 :** గోపాలపురం ప్రాథమిక పాఠశాలలో గదుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25లక్షలు మంజూరు చేసింది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంగోపాలపురం ప్రభుత్వ ప్రాథమికపాఠశాలలోగదులు శిథిలమైన తీరుపై పత్రికలో ప్రచురితమైన కథనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. వెంటనే పాఠశాలను సందర్శించి, వసతులకల్పనకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ దివాకరంను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రిన్సిపల్‌సెక్రటరీ ఎన్.శ్రీధర్ ఉపాధ్యాయిని ఇందిరతో మాట్లాడారు. పాఠశాలలోపరిస్థితులను గురించి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి ఆదేశాలతోకలెక్టర్ దివాకర గురువారం పాఠశాలను సందర్శించారు. పాఠశాల అభివృద్ధిపై చొరవ చూపిన ఉపాధ్యాయిని నిమ్మతోట ఇందిరను అభినందించారు. పాఠశాలలో గదుల నిర్మాణానికి రూ.25లక్షలు విడుదల చేస్తున్నట్లు ఆమెకు తెలియజేశారు. ఆ వెంటనే నిధులు మంజూరు చేశారు.

## స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కండి

### మంత్రులకు లోకేశ్ పిలుపు



**అమరావతి, ఆగస్ట్ 6 :** స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని మంత్రులకు విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లో కూటమి జయకేతనం ఎగరేసేలా మంత్రులంతా కష్టపడాల్సి ఉంటుందన్నారు. గురువారం కేబినెట్ సమావేశానికి ముందు మంత్రులతో లోకేశ్ బ్రేక్ ఫాస్ట్ సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల్లో మెజారిటీ స్థానాలను కూటమి అభ్యర్థులు కైవసం చేసుకోవాలన్నారు. ఈ ఎన్నికలు అనుకున్న సమయానికే జరుగుతాయని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ చేసిన విధ్వంసం, కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టిన తీరును అందరికీ తెలియాలని చెప్పారు. ప్రతి ఇంటి వద్దా కనీసం 3 నిమిషాలైనా ఉండి వివరించాలంటూ మంత్రులకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీలో చర్చించాల్సిన అంశాలపై లోకేశ్ వద్ద మంత్రులు చర్చించారు. ఎల్‌నినో పరిస్థితులను ప్రజలకు అసెంబ్లీ వేదికగా వివరిద్దామని మంత్రి తెలిపారు. జలాశయాల్లోకి వరద రావడం కాస్త ఊరటనిచ్చే అంశమని చెప్పుకొచ్చారు. తొలి ప్రాధాన్యం తాగునీరు, ద్వితీయ ప్రాధాన్యం పశుగ్రాసానికి ఇవ్వాలని సూచించారు. ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారానికి అసెంబ్లీని వేదిక చేసుకుందామని మంత్రులకు లోకేశ్ వివరించారు.

## జగన్ అరాచకాలతో జనం బెంబేలు

- పరామర్శల పేరుతో శాంతిభద్రతల సమస్య
- గంజాయి, తాగుబోతు బ్యాచ్‌లతో వీరంగం
- ఇప్పటికే ముగ్గురు ప్రాణాలు కోల్పోయినా పాశ్చాత్తాపం ఏదీ
- మండిపడ్డ హోంమంత్రి అనిత



**అమరావతి,ఆగస్ట్6 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పారమర్శల పేరుతో రాష్ట్రంలో అరచాకం సృష్టిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత నుంచి పరామర్శల పేరుతో జగన్ సృష్టించిన విధ్వంసాన్ని వివరిస్తూ మీడియాకు ఆమె ప్రజెంటేషన్ ఇచ్చారు. జగన్ పర్యటనల్లో సృష్టించిన అరాచకాల వీడియోలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ... తన రాజకీయం కోసం పేదలను గొడ్డలి పార్టీ అధ్యక్షుడు ఇబ్బంది పెడుతున్నారని ధ్వజమెత్తారు. రెండేళ్లలో జగన్ చేసిన పర్యటనలతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. పరామర్శల పేరుతో విధ్వంసం, అరాచకం సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ బూటకపు పరామర్శలు చేస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. మంచి, చెడు రెండింటిని ప్రజలు గమనిస్తారని తెలిపారు. ఈ రెండేళ్లలో రెండు వేర్వేరు నడవడిక ఉన్న నాయకులను ప్రజలు చూశారని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు రోజుకు 18 గంటలు కష్టపడుతు న్నారని, సీఎం కృషితోనే పరిశ్రమలు, పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయని వివరించారు. ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కూడా మద్దతు ఇస్తోందని వెల్లడించారు. మరోవైపు గొడ్డలి పార్టీ అధ్యక్షుడు బయట అడుగు పెడితే విధ్వంసం, అరాచకం జరుగుతోందని ఆగ్రహించారు. ఆయన బయట అడుగుపెడితే మహిళలకు రక్షణ లేదని, సామాన్య ప్రజలు వ్యాపారాలు చేసుకోలేరని చెప్పుకొచ్చారు. పోలీసులను సైతం బెదిరించి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆగ్రహించారు. ఏపీలో అభివృద్ధిని చూసి ఓర్వలేక ఏదో ఒక పరామర్శ పేరుతో ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని దుయ్యబట్టారు. భవిష్యత్తు మన బిడ్డలదని... మన చుట్టూ ఎలాంటి నాయకులు ఉన్నారో గమనించాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో ధర్నాలు, నిరసనలు చేసే హక్కు ప్రతిపక్షానికి ఉందని చెప్పుకొచ్చారు. వైసీపీ నేతలు బాధ్యతాయుతమైన ప్రశ్నలు అడగాలని.. తాము సమాధానం చెబుతామని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క పనినైనా ఆయన చేస్తున్నారా ప్రజలు ఆలోచించాలని పేర్కొన్నారు.

# శామ్‌సంగ్ పండగ ఆఫర్లు, సులభ రుణాలు

అంతర్జాతీయంగా ఎలక్ట్రానిక్స్ ముడిసరుకుల సరఫరాలో ఆటంకాలతో పాటు మెమొరీ చిప్‌ల ధరలు భారీగా పెరిగినా.. పండగల సీజన్‌లో భారత వినియోగదారులకు ఫోన్ల ధరల్లో రాయితీలే కాక వడ్డీ రహిత సులభ వాయిదాల్లో కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు శామ్‌సంగ్ సౌత్‌వెస్ట్ ప్రెసిడెంట్, సీఈఓ జేబీ పార్క్ వెల్లడించారు. పెరిగిన ఉత్పత్తి వ్యయాలను కంపెనీయే గరిష్ఠంగా భరించి, వినియోగదారులపై భారం తగ్గించేందుకు చూస్తోందని స్పష్టం చేశారు. ముడిసరుకుల ధరల పెంపు కారణంగా 2026 ప్రథమార్ధంలో భారత ఎలక్ట్రానిక్స్ మార్కెట్ 15% క్షీణత చవిచూసిందని, ద్వితీయార్థంలో కూడా సవాళ్లు కొనసాగొచ్చని అన్నారు. గత 6 నెలల్లో మెమొరీ చిప్‌ల ధరలు పెరిగి, స్మార్ట్‌ఫోన్‌ల ధరలు 20-30% పెరిగాయి. రాబోయే 12-18 నెలల వరకు కొత్తగా చిప్ తయారీ ప్లాంట్‌లు అందుబాటులోకి రావని, కాబట్టి చిప్‌ల ధరలు అధికంగానే కొనసాగొచ్చని పార్క్ అంచనా వేశారు. ఇటీవల విడుదల చేసిన 8వ తరం ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్లు గెలాక్సీ జడ్8 సిరీస్‌ను భారత్‌లోనే తయారు చేస్తున్నామని, ఈనెల 7 నుంచి ఇవి అందుబాటులోకి వస్తాయని తెలిపారు.









## ఫ్లాట్‌గా ముగిసిన నిఫ్టీ

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పడుతాయన్న అంచనాలతో చమురు ధరలు దిగిరావడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. ముఖ్యంగా పీఎస్‌యూ, బ్యాంక్ స్టాక్స్ కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది. దీంతో వరుసగా రెండో రోజూ సూచీలు లాభపడ్డాయి. సెన్సెక్స్ 350 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ మాత్రం ఫ్లాట్‌గా ముగిసింది. సెన్సెక్స్ 373.76 పాయింట్ల లాభంతో 78,954.76 వద్ద ముగిసింది. నిఫ్టీ 11.35 పాయింట్లు పెరిగి 24,636.00 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.23 వద్ద ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో రిలయన్స్, ఎస్‌బీఐ, బీఈఎల్, ఐసీఐసీఐ, ఎటర్నల్, టైటాన్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. పవర్‌గ్రిడ్, టీసీఎస్, ఇండిగో, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ, ఎన్‌టీపీసీ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 79.90 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు ధర 4,269.48 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## తొలి రోజు నుంచే ప్రతి సవాలుకు జవాబు ఇవ్వాలి

### గౌతమ్ గంభీర్

మొన్నటి వరకు వన్డేలు, టీ20లు ఆడిన భారత జట్టు ఇప్పుడు టెస్టు ఫార్మాట్‌లో తలపడేందుకు సిద్ధమైంది. ఇప్పటికే శ్రీలంకకు చేరుకొన్న టీమ్‌ఇండియా.. ఆ జట్టుతో రెండో టెస్టుల సిరీస్‌ను ఆడనుంది. ఆగస్టు 15 నుంచి గాలె వేదికగా మొదటి టెస్టు ప్రారంభం కానుంది. దానికంటే ముందు.. శుక్రవారం నుంచి మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది. ఈ క్రమంలో టీమ్‌ఇండియా ఆటగాళ్లకు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కీలక సూచనలను చేశాడు. ఆ వీడియోను బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. "మన ముందు ఏ లక్ష్యం ఉందో మనకు తెలుసు. ఎందుకోసం ఆడుతున్నామో తెలుసు. పరిమితులను అధిగమించగలం. ఏదైనా సాధించగలం. అన్ని విభాగాల్లోనూ సత్తా చూపించగలం. బ్యాటింగ్, బౌలింగ్ ఏదైనా సరే.. ఆగస్టు 15 ఉదయం నుంచి మనకు ఎదురయ్యే ప్రతి సవాలుకు జవాబు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలి. ఇప్పట్నుంచే అందుకోసం సన్నద్ధమవుదాం. ఇప్పుడు మనతోపాటు ఇద్దరు కొత్త ప్లేయర్లు ఉన్నారు. వారిద్దరికి శుభాకాంక్షలు చెబుతున్నా. సరాంశ్ ఇక్కడి వరకు వచ్చేందుకు చాలా కష్టపడ్డావు. ఎప్పుడు అవకాశం వచ్చినా దేశం, కుటుంబం గర్వపడేలా చేస్తావని ఆశిస్తున్నా. ఇక ఆకిబ్



నబీకి స్వాగతం. గత సీజన్‌లో అదరగొట్టావు. జమ్ముకశ్మీర్ జట్టు రంజీ ట్రోఫీని నెగ్గడంలో కీలక పాత్ర పోషించావు. ఇక, మనతోపాటు పనిచేసేందుకు శుభదీప్ ఘోష్ (ఫీల్డింగ్ కోచ్) వచ్చారు. చాలా జట్లతో గత కొన్నేళ్లుగా ఆయన వర్క్ చేశారు. ఆయన నిబద్ధత, ఎనర్జీ లెవల్స్ అద్భుతం. తన ప్రతిభతో మనందరిని లక్ష్యం దిశగా తీసుకెళ్తారని ఆశిస్తున్నా" అని గౌతమ్ గంభీర్ వ్యాఖ్యానించాడు.



## బంగారం, వెండి ధరలకు రెక్కలు

బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో వరుసగా మూడో రోజూ ఈ రెండు లోహాల ధరలు పరుగులు పెట్టాయి. మూడు రోజుల వ్యవధిలో బంగారం రూ.6 వేలకు పైగా పెరగ్గా.. వెండి దాదాపు రూ.11 వేల మేర ఎగబాకింది. ప్రస్తుతం కమొడిటీ మార్కెట్‌లో గోల్డ్ ఫ్యూచర్ అక్టోబర్ డెలివరీ 10 గ్రాముల బంగారం ధర రూ.757 పెరిగి రూ.1.49 లక్షల వద్ద ట్రేడవుతోంది. సిల్వర్ ఫ్యూచర్స్ సెప్టెంబర్ డెలివరీ కిలో వెండి ధర రూ.228 పెరిగి రూ.2.27 లక్షల వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4,257 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. ఔన్సు వెండి 61.83 డాలర్లుగా ఉంది. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.95.23గా ఉంది. దీన్ని అనుసరించి గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి పసిడి రూ.1.52 లక్షలు (పన్నులు కలుపుకొని) పలుకుతోంది. ఇటీవల కాలంలో చాలా రోజుల పాటు పుత్తడి ధర రూ.1.45 లక్షల వద్ద కొనసాగుతూ వచ్చింది. ఇక, కిలో వెండి రూ.2.31 లక్షలుగా ఉంది. అమెరికా- ఇరాన్ మధ్య యుద్ధంతో బంగారం, వెండి ధరలు భారీగా దిగి వచ్చిన సంగతి తెలిసిందే. యుద్ధం వల్ల ద్రవ్యోల్బణ భయాలు నెలకొనడం, వడ్డీ రేట్లు పెరుగుతాయన్న అంచనాలతో ఈ లోహాల ధరలు క్షీణించాయి. బంగారం ధర గరిష్ఠాల నుంచి దాదాపు 19 శాతం మేర పతనమైంది. అయితే, ప్రస్తుతం పశ్చిమాసియాలో శాంతివైపుగా అడుగులు పడుతున్నాయి. హర్మూజ్ జల సంధిని తెరిచే విషయంలో ఇరాన్, ఒమన్ మధ్య జరుగుతున్న చర్చల్లో పురోగతి కనిపిస్తోంది. దీంతో క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర మళ్లీ 80 డాలర్ల దిగువకు చేరింది. అమెరికా డాలరు బలహీన పడడం, ట్రెజరీ ఈల్డ్స్ తగ్గుముఖం పట్టడం, కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్ల పెంపు ఉండకపోవచ్చన్న అంచనాలు బలపడడం వంటి పరిస్థితులు బంగారం, వెండికి అనుకూలంగా మారాయి. ఈ క్రమంలోనే వీటికి డిమాండ్ ఏర్పడడంతో మళ్లీ ధరలకు రెక్కలొచ్చాయి.



## రోహిత్‌తోపాటు ఆ ఇద్దరి ఆటను చూడాలనుకుంటున్నా : హాషీమ్ ఆమ్లా

వన్డే ప్రపంచ కప్ టోర్నీకి మరో ఏడాది మాత్రమే ఉంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యంలో 2027 ఎడిషన్ జరగనుంది. ఇప్పటికే వేదికలు, క్వాలిఫయర్స్ షెడ్యూల్‌ను ఐసీసీ ప్రకటించింది. వన్డే ప్రపంచ కప్ షెడ్యూల్ తెలియాలంటే ఇంకొన్ని రోజులు వేచి చూడాలి. అయితే, ఈ మెగా టోర్నీలో భారత్ నుంచి సీనియర్ ద్వయం రోహిత్ - విరాట్ కోహ్లీ బరిలోకి దిగడంపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. ఈ క్రమంలోనే దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు హాషీమ్ ఆమ్లా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వచ్చే వరల్డ్ కప్‌లో రోహిత్‌తోపాటు మరో ఇద్దరి ఆటను చూసేందుకు ఉత్సాహంగా ఉన్నట్లు తెలిపాడు. "దక్షిణాఫ్రికా యువ బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్ అద్భుతమైన ఆటగాడు. అలాగే ఆస్ట్రేలియా నుంచి ట్రావిస్ హెడ్ కూడా సూపర్. మెగా టోర్నీల్లో అదరగొట్టేస్తాడు. అతడు ఆడే విధానం చాలా బాగుంటుంది. ఇక భారత్ నుంచి రోహిత్ శర్మ ఆటను చూడటం నాకెంతో ఇష్టం. అతడి స్ట్రోక్ ప్లేలో అన్ని రకాల షాట్లు ఉంటాయి. వచ్చే వరల్డ్ కప్‌లో ఈ ముగ్గురి ఆటను చూడాలని ఆత్రుతగా ఉంది" అని హాషీమ్ ఆమ్లా వెల్లడించాడు. బ్రెవిస్, హెడ్ వచ్చే ప్రపంచ కప్‌లో ఆడటం ఖాయమే. ఏదైనా గాయమైతే తప్ప వారిని ఆయా బోర్డులు తుది జట్టులో నుంచి తప్పించలేవు. కానీ, రోహిత్ విషయంలోనే పరిస్థితి భిన్నమైంది. అప్పటి వరకూ అతడు ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడంతోపాటు వయసు కూడా 40 దాటనుండటం ప్రతికూలంగా మారనుంది. గంభీర్ - అగార్కర్ జోడీ కూడా రోహిత్‌ను కొనసాగించడంపై సుముఖంగా లేదనే వార్తలు వస్తున్నాయి. మరోవైపు అభిమానులు మాత్రం దూకుడుగా ఆడే రోహిత్‌ను పక్కన పెట్టడం సరైంది కాదనే భావన వ్యక్తం చేస్తున్నారు.

## నా రికార్డును వైభవ్ బద్దలు కొడతాడు

### ఇంగ్లాండ్ ఆటగాడు జాస్ బట్లర్

ఇంగ్లాండ్ ఆటగాడు జాస్ బట్లర్ చరిత్ర సృష్టించాడు. టీ20ల్లో టాప్ స్కోరర్‌గా మారాడు. ఇప్పటి వరకు ఆ జాబితాలో విండీస్ మాజీ క్రికెటర్ కీరన్ పొలార్డ్ (14,803 పరుగులు) ఉండేవాడు. అందుకోసం పొలార్డ్ 746 మ్యాచులు తీసుకొన్నాడు. ఇప్పుడు బట్లర్ కేవలం 522 మ్యాచుల్లోనే 14,833 పరుగులు చేసి అగ్రస్థానం సాధించాడు. ప్రస్తుతం ది హండ్రెడ్ టోర్నీలో బట్లర్ ఆడుతున్నాడు. మాంచెస్టర్ సూపర్ జెయింట్స్ తరఫున బరిలోకి దిగిన అతడు వెల్ష్ ఫైర్ జట్టుపై కేవలం 20 బంతుల్లోనే 51 పరుగులు చేశాడు. "క్రికెట్ ఎంత వేగంగా మారుతుందో అనిపిస్తుంటుంది. ఒక రోజు దారుణమైన పరిస్థితిని ఎదుర్కొంటాం. మరో రోజు అదృష్టం కలిసొస్తుంది. కొన్ని నెలల కిందట ఫామ్ కోసం ఇబ్బంది పడ్డా. ఇప్పుడు నా కెరీర్‌లోనే అత్యుత్తమ బ్యాటింగ్ చేస్తున్నాననిపిస్తోంది. ఆటగాడి ముందు రెండే మార్గాలు ఉంటాయి. గేమ్‌ను వదిలేయడం లేదా ముందుకు సాగుతూ ఫామ్‌ను అందిపుచ్చుకోవడం. నేను రెండో దానిపై దృష్టిసారించా. ప్రపంచంలోనే టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా మారడం సంతోషంగా అనిపిస్తోంది. అయితే,



ఎవరో ఒకరు ఈ రికార్డునూ అధిగమిస్తారనుకుంటున్నా. అదీ వైభవ్ సూర్యవంశీ కావొచ్చనేది నా అంచనా. ఇప్పటికైతే ఈ ఘనత పట్ల గర్వంగా ఉంది" అని బట్లర్ వెల్లడించాడు.



## వాట్సప్ గ్రూప్ చాట్‌లో కొత్త ఫీచర్లు..

ప్రముఖ మెసెజింగ్ ప్లాట్‌ఫాం వాట్సప్.. గ్రూప్‌లు వినియోగదారుల కోసం కొత్త అప్‌డేట్లు తీసుకొచ్చింది. పోల్స్‌ను మరింత సులభం చేసింది. గ్రూప్ సభ్యులందరినీ ట్యాగ్ చేయడానికి కొత్త ఆప్షన్‌ను పరిచయం చేసింది. గ్రూప్‌లోని సభ్యులతో మరో గ్రూప్‌నూ క్రియేట్ చేసే సదుపాయాన్నీ తీసుకొచ్చింది. ఇప్పటికే ఈ ఫీచర్లు చాలా మందికి అందుబాటులోకి వచ్చాయి. ఓసారి ప్రయత్నించండి. వాట్సప్ గ్రూపులో ఏదైనా విషయంపై ఓటింగ్ కోసం పోల్స్ పెడుతుంటాం. ఆ పోల్స్ మనం డిలీట్ చేసేంతవరకు అలానే ఉంటాయి. ఇకపై ఆ పోల్స్ ఎప్పుడు ముగియాలో టైమ్ సెట్ చేసుకోవచ్చు. ఆ సమయం పూర్తికాగానే ఓటింగ్ ఆటోమెటిక్‌గా లాక్ అవుతుంది. పోల్స్‌కి ఎంత మంది ఓటు వేశారో, ఎవరెవరు స్పందించారో ఇకపై గ్రూప్ సభ్యులకు తెలియకుండా చేయొచ్చు. పోల్ పట్టిన వ్యక్తికి మాత్రమే కనిపిస్తుంది. దీంతో గ్రూపు సభ్యులు వారి భావాలను ఎలాంటి మొహమాటం లేకుండా చెప్పొచ్చు. పోల్ క్రియేట్ చేసిన తర్వాత 15 నిమిషాలలోపు ఎడిట్ చేసే ఆప్షన్ కూడా తెచ్చింది. ఏదైనా ముఖ్యమైన విషయాన్ని గ్రూప్‌లో పంచుకున్నప్పుడు అందరినీ ఒకేసారి ట్యాగ్ చేసేలా ఘశ్రీశ్రీ ఆప్షన్‌ను వాట్సప్ తీసుకొచ్చింది. ఇలా మెన్షన్ చేసినప్పుడు ఒకేసారి అందరికీ నోటిఫికేషన్ వెళ్తుంది. 32 కంటే ఎక్కువ మంది ఉన్న గ్రూప్‌లకు మాత్రమే ప్రస్తుతం ఈ ఫీచర్ అందుబాటులో ఉంది. ఈ ఆప్షన్ కేవలం అడ్మిన్లకే. గ్రూప్ చాట్‌లను మ్యూట్ చేసినా ఘశ్రీశ్రీ ఆప్షన్‌తో నోటిఫికేషన్ వస్తుంది. అది కూడా వద్దనుకుంటే అలర్ట్‌లను ప్రత్యేకంగా మ్యూట్ చేయొచ్చు. ప్రస్తుతం ఉన్న గ్రూప్‌ల్లో కొంతమంది సభ్యులతో కలిసి సింగిల్ ట్యాప్‌తో వెంటనే ఇంకో గ్రూప్ క్రియేట్ చేయొచ్చు. ఒక్కొక్కరిని కాకుండా.. ఒకేసారి అందరితో కొత్త గ్రూప్ క్రియేట్ చేయొచ్చన్నమాట. పుట్టినరోజులు వంటి సందర్భాల్లో అందులో ఒక్క సభ్యుడిని మినహా మిగిలినవారంతా ఏదైనా సర్‌ప్రైజ్ ప్లాన్ చేయాలన్నప్పుడు ఈ సిమిలర్ గ్రూప్ పనికొస్తుంది.



## భారత్‌తో వార్మప్ మ్యాచ్..

### శ్రీలంక ఎలెవన్ జట్టు ప్రకటన

రెండు టెస్టుల సిరీస్ కోసం శ్రీలంక పర్యటనకు వెళ్లిన టీమ్‌ఇండియా తొలుత వార్మప్ మ్యాచ్ ఆడనుంది. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు కొలంబో క్రికెట్ క్లబ్ మైదానంలో శ్రీలంక ఎలెవన్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ ఉదయం 10 గంటలకు మొదలుకానుంది. స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్షప్రసారం ఉంటుంది. భారత్‌తో ప్రాక్టీస్ మ్యాచ్ కోసం 15 మందితో శ్రీలంక జట్టును ప్రకటించింది. యువ బౌలింగ్ ఆల్‌రౌండర్ సోనల్ దినూషను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ప్రధాన జట్టులో చోటు దక్కించుకోవడం కోసం పోటీపడుతున్న ఏడుగురు కీలక ఆటగాళ్లు శ్రీలంక ఎలెవన్ టీమ్‌లో ఉన్నారు. కెప్టెన్ దినూషతో పాటు పేసర్లు లహిరు కుమార, విశ్వ ఫెర్నాండో, ఆఫ్ స్పిన్నర్ రమేశ్ మెండిస్, నిషాన్ మదుష్క, పవన్ రత్నాయకే అంజల బండార ఈ జాబితాలో ఉన్నారు.ఇండియా ఎతో మ్యాచ్‌లో 10 వికెట్లు తీసి ఆకట్టుకున్న లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ దిలుమ్ సుదీర, ఐదు వికెట్లు పడగొట్టిన కేసర నువాంత వంటి ప్రతిభావంతులు కూడా శ్రీలంక ఎలెవన్ జట్టులో చోటు దక్కించుకున్నారు. ఆగస్టు 15 నుంచి మొదలుకానున్న రెండు టెస్టుల సిరీస్ కోసం శ్రీలంక ఇంకా అధికారికంగా జట్టును ప్రకటించలేదు. స్పిన్‌కు అనుకూలించే శ్రీలంక పిచ్‌లను అర్థం చేసుకోవడానికి వార్మప్ మ్యాచ్ టీమ్‌ఇండియాకు బాగా ఉపయోగపడనుంది.

## సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు వెళ్లిన క్రికెటర్లు బరువు పెరుగుతున్నారా..?

ఆటగాళ్ల గాయాల విషయంలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ తీరుపై విమర్శలు వస్తున్నాయి. అక్కడికి వెళ్లిన ఆటగాళ్లు బరువు అధికంగా పెరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. హర్షిత్ రాణా సీవోఈకి వెళ్లాక నాలుగు కేజీల బరువు పెరిగాడట. దీనివల్లే అతడు ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ సమయంలో గాయపడినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై వివరణ ఇవ్వాలని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అడిగినట్లు కథనాలు వస్తున్నాయి. మరోవైపు యో-యో టెస్టు స్థానంలో అమలు చేస్తోన్న బ్రాంకో టెస్టుపైనా బీసీసీఐ పెద్దలు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. దీంతో సీవోఈలో పెను మార్పులకు క్రికెట్ బోర్డు శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలుస్తోంది. ఆటగాళ్ల ఫిట్‌నెస్ ప్రమాణాలు పడిపోవడానికి గల కారణాల గురించి చీఫ్ ఫిజియో కమలేశ్ జైన్‌పై బీసీసీఐ ప్రశ్నల వర్షం కురిపించినట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఇంగ్లాండ్ పర్యటన సమయంలో పలువురు ప్లేయర్లు కండరాలు పట్టేయడం వంటి సమస్యతో బాధపడ్డారు. అలాగే అధిక బరువుతో ఉన్నప్పటికీ హర్షిత్‌కు క్లీన్‌చీట్ ఇవ్వడంపైనా ఆగ్రహం వ్యక్తమైంది. "ఆటగాడి స్థాయిని చూసి కంగారు పడాల్సిన అవసరం లేదు. సంతృప్తిగా అనిపించని అంశాలను నిర్భయంగా ప్రస్తావించాలని కమలేశ్‌కు బీసీసీఐ పెద్దలు సూచించారు. ఎందుకంటే కొందరి ఆటగాళ్ల కదలికలు మైదానంలో సరిగ్గా లేవనిపించింది. మరీ ముఖ్యంగా సీనియర్ బ్యాటర్లు ఎక్కువ సమయం క్రీజ్‌లో ఉంటే.. వికెట్ల మధ్య వేగంగా పరిగెత్తడంలో ఇబ్బంది పడుతున్నారు. ఫీల్డింగ్‌లో వేగంగా ఉండేవారి సంఖ్య తగ్గిపోయింది. ఇక హర్షిత్ రాణా బరువు 4 కిలోలు ఎక్కువగా ఉందని మేనేజ్‌మెంట్ గుర్తించింది. ఈ విషయంలో సీవోఈ




మరింత అప్రమత్తంగా ఉండాల్సింది. అతడి బరువు 96 కిలోలకు మించకూడదని సిబ్బంది ఇప్పుడు సూచించారు. ప్రస్తుతం 94 కేజీల బరువుతో ఉన్నాడు. అయితే, ఇంగ్లాండ్ పర్యటనకు అతడిని ఎంపిక చేసినప్పుడు బరువు 97 కేజీల వరకూ ఉంది. దీనిపైనా చీఫ్ ఫిజియోను బీసీసీఐ వివరణ కోరింది" అని బోర్డు వర్గాలు తెలిపాయి.

జనం వార్త



# నవంబర్ 6న రామాయణ విడుదల

### అధికారికంగా ప్రకటించిన చిత్ర బృందం

నితీశ్ తివారీ దర్శకత్వంలో భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'ను ప్రకటించినప్పుడే రెండు భాగాల విడుదల ఎప్పుడనేది చిత్రబృందం వెల్లడించింది. ఈ ఏడాది దీపావళి కానుకగా.. మొదటి భాగాన్ని, వచ్చే ఏడాది దీపావళికి రెండో పార్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ తెలిపారు. తాజాగా మొదటి భాగం అధికారిక విడుదల తేదీని చిత్ర నిర్మాణ సంస్థ ప్రకటించింది. నవంబర్ 6న రామాయణను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలుపుతూ పోస్ట్ పెట్టింది అదే రోజున రణ్‌బీర్ కుమార్తె రాహా పుట్టినరోజు కావడంతో ఈ తేదీ ఆయనకు మరింత ప్రత్యేకం కానుంది. ఇక ఈసినిమాలో మండోదరి పాత్రలో కాజల్ కనిపించనున్నారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో ఈ చిత్రం గురించి మాట్లాడారు. ఇది ఎంతో గొప్పగా రూపొందుతోందని.. ప్రపంచదేశాలకు మన సంస్కృతిని తెలియజేయడానికి రామాయణ సరైన కథ అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందే కథలను సృష్టించగల సామర్థ్యం భారతీయ సినిమాకు ఉందని చెప్పారు. రూ.4000కోట్లతో ఈ సినిమా రూపొందుతోంది. ఇందులో రాముడిగా రణ్‌బీర్ నటించగా.. సీతగా సాయిపల్లవి, రావణుడి పాత్రలో యశ్ కనిపించనున్నారు. ఇటీవల ట్రైలర్‌ను విడుదల చేయగా అది విజువల్ వండర్‌గా యూట్యూబ్ ట్రెండింగ్‌లో నిలిచింది.




# చకచకా రాకా మూవీ షూటింగ్

### మెటర్నిటీ బ్రేక్‌లో దీపికా పడుకొణె

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ప్రస్తుతం మాతృత్వాన్ని ఆస్వాదిస్తూ కుటుంబంతో సమయం గడుపుతు న్నారు. అయితే ఆమె మెటర్నటీ బ్రేక్ కారణంగా అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'రాకా' షూటింగ్‌కు ఆటంకం ఏర్పడు తుందనే ప్రచారం జరుగుతున్న వేళ, చిత్రబృందం అందుకు పూర్తి భిన్నంగా ముందుకు సాగుతున్నట్లు సమాచారం. సినీ వర్గాల సమాచారం ప్రకారం, దీపికా మెటర్నటీ బ్రేక్‌ను ముందుగానే దృష్టిలో పెట్టుకుని చిత్రబృందం షూటింగ్ షెడ్యూల్‌ను ఎంతో కచ్చితంగా ఎలాన్ చేసింది. ఆమె అందుబాటులో ఉన్న సమయంలోనే ఎక్కువ భాగం సన్నివే శాలను పూర్తి చేయడంతో ప్రస్తుతం షూటింగ్ ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతోంది. దీపికా విరామం లో ఉన్న రోజుల్లో ఇతర ప్రధాన నటీనటులతో చిత్రీకరణ నిర్వహిస్తూ ఒక్క రోజు కూడా వృథా కాకుండా మేకర్స్ జాగ్రత్తలు తీసుకున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం దీపికా పదుకొణెకు సంబంధించిన షూటింగ్ దాదాపు పూర్తయినట్లు సమాచారం. చిన్న సన్నివేశాలు మాత్రమే ఉండగా, వాటిని తర్వాతి దశలో చిత్రీకరించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆమె వ్యక్తిగత జీవితానికి, సినిమా నిర్మాణానికి మధ్య ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మేక ర్స్ పక్కా ప్లానింగ్ చేసినట్లు తెలుస్తోంది. 'రాకా' సినిమాలో దీపికా పదుకొణె పాత్ర కథకు అత్యంత కీలకమని సమాచారం. ఆమె పాత్ర చుట్టూనే కథలో ప్రధాన మలుపు లు తిరుగుతాయని టాక్ వినిపిస్తోంది. అందుకే షూటింగ్ ప్రారంభ దశలోనే ఆమె సన్నివేశాలకు ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేసినట్లు తెలుస్తోంది.




భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూ స్తున్న చిత్రాల్లో 'రాకా' ఒకటిగా నిలిచింది. భారీ తారాగణం, హై టెక్నికల్ స్టాండర్డ్స్, భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నా యి. షూటింగ్ అనుకున్న షెడ్యూల్ ప్రకారమే కొనసాగుతు ండటంతో, సినిమా విడుదల కూడా నిర్ణయించిన సమయానికే జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## రామ్ చరణ్ సినిమాలో రుక్మిణి వసంత్?

తెలుగు సినీ అభిమానులతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో రామ్ చరణ్-సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా ఒకటి. ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించినప్పటికీ, ఆ తర్వాత ఎలాంటి అప్‌డేట్ రాలేదు. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఈ పనులు మరికొంత కాలం కొనసాగనున్న నేపథ్యంలో షూటింగ్ ప్రారంభం కావడానికి ఇంకా సమయం పట్టే అవకాశం ఉందని సమాచారం. అయితే ఈ చిత్రానికి హీరోయిన్‌ను మాత్రం మేకర్స్ దాదాపు ఖరారు చేసినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం వినిపిస్తున్న వార్తల ప్రకారం, రామ్ చరణ్‌కు జోడీగా కన్నడ నటి రుక్మిణి వసంత్‌ను ఎంపిక చేయాలని చిత్ర బృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఆమెతో సంప్రదింపులు కూడా జరిపినట్లు ప్రచారం జరుగుతుంది. అన్ని అనుకున్నట్లు జరిగితే ఈ చిత్రంలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా కనిపించే అవకాశాలు ఉన్నాయని టాక్. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరి నిజంగానే రుక్మిణి వసంత్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా ఎంపికవుతుందా? లేక మరో హీరోయిన్‌కు అవకాశం దక్కుతుందా? అనేది తెలియాలంటే కొంతకాలం వేచి చూడాల్సిందే.



## అలాంటి క్వాలిటీ ఇంకెవరిలో చూడలేదు

### నివేదా థామస్

యంగ్ టాలెండెడ్ హీరోయిన్ నివేదా థామస్.. 'నిన్ను కోరి' చిత్రంతో తెలుగు ఆడియన్స్‌లో విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది. అలాగే వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులని ఎంతగానో అలరించి విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్న ఈ అమ్మడు.. సెకండ్ ఇన్నింగ్‌లో భాగంగా '35 చిన్న కథ కాదు' సినిమతో మరింత దగ్గరైంది. ఈ సినిమాలో ఆమె నటనకు గాను బెస్ట్ ఫీమేల్ లీడ్‌గా గద్దర్ అవార్డు దక్కించుకుంది. ఇదిలా ఉంటే.. రీసెంట్ ఇంటర్వ్యూలో నానిపై ప్రశంసలు కురిపించింది 'సాధారణంగా కొత్త లాంగ్వేజ్‌లో సినిమాలు చేస్తున్నప్పుడు నేను ఒంటరిగా ఫీల్ అవుతాను. కానీ టాలీవుడ్‌లో మొదటి సినిమా చేసినప్పుడు అసలు నాకు ఆ థాట్ కూడా రాలేదు. నిజంగా దీనికి నేను నాని స్పెషల్ థాంక్స్ చెప్పాలి. ఎందుకంటే అతను నా కోసం తన ఇంటిని ఎప్పుడు తెరిచే ఉంచాడు. ఎలాంటి అవసరం వచ్చిన మొదట నానితో షేర్ చేసుకునేదాన్ని. అతను అంతా కంఫర్ట్ ఇస్తారు. నిజంగా అలాంటి క్వాలిటీ ఇంకెవరిలో చూడలేదు' అంటూ నానిపై ప్రశంసలు కురిపించింది. కాగా.. నివేదా థామస్, నాని హీరోగా నటించిన 'జెంటిల్‌మేన్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో 'నిన్ను కోరి', 'ఎ' వంటి విజయవంతమైన చిత్రాలు కూడా వచ్చాయి.

## కింగ్ జాకీ క్వీన్.. మూవీపై ఆసక్తికర అంశం

### అనుష్క కోసం 12 ఏళ్ల క్రితం రాసిన కథగా ప్రచారం

ఈ శుక్రవారం విడుదల కానున్న తెలుగు చిత్రాల్లో 'కింగ్ జాకీ క్వీన్ ' ఒకటి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, ప్రచార చిత్రాలతో ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించిన ఈ పీరియాడిక్ క్రైమ్ డ్రామాపై సినీ వర్గాల్లో మంచి అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రానికి మరో ప్రత్యేకత ఏమిటంటే.. ప్రముఖ దర్శకుడు కిరణ్ కుమార్ చివరిసారిగా దర్శకత్వం వహించిన సినిమా ఇదే కావడం. దీక్షిత్ శెట్టి, శశి ఓదెల, యుక్తి తరేజా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన ప్రమోషనల్ కార్యక్రమంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా వెల్లడించిన ఆసక్తికర విషయం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. దర్శకుడు కిరణ్ కుమార్ ఈ కథను దాదాపు 12 ఏళ్ల క్రితమే సిద్ధం చేశారని వెల్లడించారు. అప్పట్లో ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కించాలని భావించిన కిరణ్ కుమార్, కథానాయిక పాత్ర కోసం స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టిని దృష్టిలో పెట్టుకుని స్క్రిప్ట్ రూపొందించారట. అయితే వివిధ కారణాలతో ఆ ప్రాజెక్ట్ అప్పట్లో సెట్స్‌పైకి వెళ్లలేదు. దీంతో సినిమా నిలిచిపోయినా, దర్శకుడు మాత్రం కథను వదిలిపెట్టకుండా కాలానికి అనుగుణంగా మార్పులు చేస్తూ మరింత బలోపేతం చేశారని తెలిపారు. మొదట అనుష్క కోసం రాసిన పాత్ర, కాలక్రమేణా మార్పులు చెంది ఇప్పుడు నటి యుక్తి తరేజా పోషిస్తున్న పాత్రగా రూపుదిద్దుకుందని సమాచారం. దీంతో ఎన్నో ఏళ్లుగా దర్శకుడు మనసులో ఉన్న కథ చివరకు 'కింగ్ జాకీ క్వీన్' రూపంలో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సినిమాతో మరో ఆసక్తికర అంశం కూడా ఉంది. ప్రముఖ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సోదరుడు శశి ఓదెల ఈ చిత్రంతో హీరోగా సినీ రంగంలోకి అడుగుపెడుతున్నారు. తొలి చిత్రంతోనే పీరియాడిక్ క్రైమ్ డ్రామా వంటి విభిన్న కథను ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది. ఇక హీరో దీక్షిత్ శెట్టి కీలక పాత్రలో నటిస్తుండగా, యుక్తి తరేజా కథానాయికగా కనిపించనున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు పూర్ణచంద్ర తేజస్వి సంగీతాన్ని అందించారు.




## తండ్రి నాగబాబుతో వరుణ్ తేజ్ సినిమా

### కూతురు నిహారిక నిర్మాతగా యదువంశీ మూవీ




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదలకు ముందు చిత్రబృందం జోరుగా ప్రమోషన్స్ నిర్వహిస్తుండగా, తాజాగా ఓ ఇంటర్వ్యూలో వరుణ్ తేజ్ తన తదుపరి సినిమా గురించి ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. తొలిసారిగా తన తండ్రి నాగబాబుతో కలిసి ఒకే సినిమాలో నటించబోతున్నట్లు ప్రకటించారు. నాగబాబు నటుడిగా చిరంజీవి, పవన్ కళ్యాణ్, రామ్ చరణ్, సాయిధరమ్ తేజ్ సహా మెగా కుటుంబానికి చెందిన పలువురు హీరోలతో కలిసి నటించారు. అయితే ఆశ్చర్యకరంగా తన కుమారుడు వరుణ్ తేజ్‌తో మాత్రం ఇప్పటివరకు పూర్తి స్థాయి సినిమాలో స్క్రీన్ షేర్ చేసుకోలేదు. గతంలో 'హ్యాండ్స్ అప్' సినిమాలో వరుణ్ తేజ్ చిన్ననాటి పాత్రలో కనిపించినప్పటికీ, తండ్రీకొడుకుల మధ్య ఒక్క కాంబినేషన్ సీన్ కూడా లేదు. ఇప్పుడు ఆ లోటును 'బరి' సినిమా భర్తీ చేయనుంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్, నాగబాబు కలిసి నటించడమే కాకుండా, ఇద్దరి మధ్య కీలకమైన కాంబినేషన్ సీన్లు కూడా ఉంటాయని వరుణ్ వెల్లడించారు. తండ్రితో కలిసి నటించడం తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభూతిగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇక 'బరి' చిత్రాన్ని నాగబాబు కుమార్తె నిహారిక కొణిదెల నిర్మిస్తున్నారు. 'కమిటీ కుర్రాళ్లు' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు యదు వంశీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందనున్న ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల కాలికి గాయం కారణంగా విశ్రాంతి తీసుకున్న వరుణ్ తేజ్, పూర్తిగా కోలుకున్న తర్వాత 'బరి' షూటింగ్ ప్రారంభం కానుందని తెలిపారు. తొలిసారి రియల్ లైఫ్ తండ్రీకొడుకులు వెండితెరపై కలిసి కనిపించనున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్‌పై మెగా అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. 'కొరియన్ కనకరాజు' తర్వాత వరుణ్ తేజ్ కెరీర్‌లో 'బరి' మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com